తెలుగు దినపత్రిక

RNI TG TEL/ 26/A0381

# సిరి

People's Voice

వార్త పత్రిక

10-05-2026

ఆదివారం హైదరాబాద్

సంపుటి: (volume): 1

సంచిక: (ISSUE): 97

PUBLISHED FROM HYDERABAD

పేజీలు-8 వెల:రూ.4 /–



# మిషన్ భగీరథ పైప్ లైన్ మరమ్మత్తులు జరిగినా

- అనంతారంలో మిషన్ భగీరథ నీళ్లు రాక ఇబ్బందులు
- పగిలిన మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు లేక గ్రామస్తుల తీవ్ర ఇబ్బందులు

**గుమ్మడిదల (అనంతారం) మే 9( సిరి న్యూస్ ):**

గుమ్మడిదల మండలంలోని అనంతారం గ్రామంలో మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ దెబ్బతినడంతో గ్రామ ప్రజలు తీవ్ర తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. గత నెల 24 న పైప్‌లైన్ పగిలిపోవడంతో గ్రామానికి మంచినీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయిందని స్థానికులు తెలిపారు.

మిగతా 5వ పేజీలో..

- నగర జనాభాకు అనుగుణంగా వసతులు
- హైదరాబాద్‌లో త్రీ-లెవెల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్
- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలో సీఎం రేవంత్ రెడ్డి
- తెలంగాణ రైజింగ్-2047 మాస్టర్ ప్లాన్ ఆవిష్కరణ




# సిగ్నల్ ఫ్రీ సిటీగా హైదరాబాద్

**హైదరాబాద్, మే 9 సిరి న్యూస్ :**

ఆధునీకరణ, పట్టణీకరణతో భవిష్యత్తులో మరిన్ని కొత్త సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పెరుగుతున్న నగర జనాభాకు అనుగుణంగా మౌలిక

మిగతా 2వ పేజీలో..

# బేటీ బచావో నినాదం ఎటు పోయింది?

బండి సంజయ్ కొడుకుపై ఫోక్సో కేసు..
ప్రధాని ఎందుకు స్పందించరు?
బాధితురాలిపైనే రివర్స్ కేసులా?
తెలంగాణలోనూ జంగిల్ రాజ్ సర్కారు..
కాంగ్రెస్‌బీజేపీల మధ్య అసహ్యకర ఒప్పందం!
మోదీ, రాహుల్‌లపై బీఆర్ఎస్ నేత కేటీఆర్ విమర్శలు

**హైదరాబాద్, మే 9 సిరి న్యూస్:**

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిపై నమోదైన ఫోక్సో కేసు వ్యవహారంపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ విషయంలో అటు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఇటు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని ఆయన ఎండగట్టారు. బాలిక పరిస్థితి...వారి కుటుంబం పైన జరుగుతున్న వేధింపులపై కేటీఆర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మీ 'బేటీ బచావో' కేవలం ఒక నినాదమేనా? కేంద్ర మంత్రి బండి

మిగతా 2వ పేజీలో..



# నేడు హైదరాబాద్ కు ప్రధాని



- నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధింపు

**హైదరాబాద్, మే 9 సిరి న్యూస్:**

భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదివారం భాగ్యనగర పర్యటనకు రానున్నారు. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ

మిగతా 2వ పేజీలో..

# తమిళనాట కొత్త చరిత్ర!

- నేడు సీఎంగా విజయ్ గా తళపతి ప్రమాణ స్వీకారం
- చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో భారీగా ఏర్పాట్లు
- 120 మంది ఎమ్మెల్యేల మద్దతుతో ప్రభుత్వ ఏర్పాటుకు లైన్ క్లియర్
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ప్రత్యేక ఆహ్వానం
- మద్దతు ఇచ్చిన కాంగ్రెస్, వీసీకే, సీపీఐ, సీపీఎం పార్టీలకు కేబినెట్‌లో చోటు

2



# సంజయ్ కు సన్ స్ట్రోక్!

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిపై పోక్సో కేసు
సాయి భగీరథ్ పై మైనర్ బాలికపై లైంగిక దాడి ఆరోపణలు
పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు
రాష్ట్ర రాజకీయాల్లో పెను దుమారం
ప్రధాని మోదీ పర్యటన వేళ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రికి కొత్త చిక్కులు
రూ. 5 కోట్లు డిమాండ్ చేశారంటూ కరీంనగర్‌లో భగీరథ్ రివర్స్ కంప్లైంట్
గతంలోనూ ర్యాగింగ్ కేసు..
ఇప్పుడు పోక్సో..

**ప్రత్యేక ప్రతినిధి, సిరి న్యూస్:**

నేడు ప్రధాన రాష్ట్ర పర్యట వేళ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కు కొడుకుతో తలనొప్పి మొదలయింది. తన కుమారుడు బండి సాయి భగీరథ్ చుట్టూ రాజకీయ సెగలు ముసురుకుంటున్నాయి. మైనర్ బాలికను లైంగికంగా వేధించాడన్న ఆరోపణలతో ఆయనపై హైదరాబాద్‌లోని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదవ్వడం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. గతంలో యూనివర్సిటీలో తోటి విద్యార్థిపై దాడి చేసిన కేసులో నిందితుడిగా ఉన్న భగీరథ్, ఇప్పుడు అంతకంటే తీవ్రమైన లైంగిక దాడి ఆరోపణలు ఎదుర్కోవడం గమనార్హం. ప్రధాని నరేంద్ర మోదీ హైదరాబాద్ పర్యటనకు వస్తున్న సమయంలో ఈ ఉదంతం వెలుగులోకి

మిగతా 2వ పేజీలో..

**బండి తనయుడి భగీరథ్‌పై ఫోక్సో కేసు**

2





## రహదారులపై ధాన్యం ఆరబోస్తే కఠిన చర్యలు

- రాత్రివేళల్లో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు
- ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకోవాలి
- ఎస్పీ పరితోష్ పంకజ్

7



7

## నిమ్జ్ అభివృద్ధి పనులలో వేగం పెంచాలి

- పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

# రాష్ట్రంలో పంట మార్పిడికి ఇదే సరైన సమయం

- వరి వద్దు.. ఉద్యాన పంటలకే మొగ్గు
- పంట మార్పిడిపై మంత్రి తుమ్మలకు రైతు కమిషన్ నివేదిక
- వొచ్చే మూడేళ్లలో 13 లక్షల ఎకరాల్లో పంట మార్పిడి లక్ష్యం
- కొత్తగా మరో లక్ష ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు ప్రణాళిక
- కేంద్ర విత్తన చట్టంలో మార్పులు చేయాలి: మంత్రి తుమ్మల డిమాండ్

**హైదరాబాద్, సిరి న్యూస్:**

రాష్ట్రంలో పంట మార్పిడి అవశ్యకతపై వ్యవసాయశాఖ కమిషన్ రూపొందించిన నివేదికను మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, సభ్యులు శనివారం

మిగతా 2వ పేజీలో..






## జీపీ కార్యదర్శుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్!

- 15వ తేదీలోగా ఆప్షన్ల సమర్పణకు అకాశం
- రాష్ట్రవ్యాప్తంగా 1,213 కార్యదర్శి పోస్టులు ఖాళీ
- మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారికి బదిలీ అవకాశం
- అత్యధికంగా నల్గొండ జిల్లాలో 85 ఖాళీలు..

3

## నాసిక్ టీసీఎస్ కేసుపై రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు




- ఒవైసీ, ఇంతియాజ్ జలీల్‌పై ఆరోపణలు

**హైదరాబాద్, మే 9 సిరి న్యూస్:**

మహారాష్ట్రలోని నాసిక్ టీసీఎస్ కేసులో నిదాఖాన్ అరెస్టు నేపథ్యంలో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ కేసు కేవలం వ్యక్తిగత నేరం కాదని, దీని వెనుక భారీ కుట్ర ఉందని ఆరోపించారు.

మిగతా 3వ పేజీలో..

## పనివాళ్లుగా చేరి.. కోట్లు దోచేస్తున్న నేపాలీ ముఠాలు



3

- జూబ్లీహిల్స్‌లో వరుస ఘటనలతో కలవరపాటులో ప్రజలు



## 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పని వేళల పెంపు

- భూముల ధరల సవరణ నేపథ్యంలో పెరిగిన రిజిస్ట్రేషన్ల డిమాండ్
- స్లాట్ బుకింగ్‌ల సంఖ్య పెంపునకు ఆదేశం
- మంత్రి పొంగులేటి కీలక నిర్ణయం

2



## ప్రధాని మోదీకి కవిత బహిరంగ లేఖ

**హైదరాబాద్, మే 9 సిరి న్యూస్:**

కల్వకుంట్ల కవిత ప్రధానమంత్రి నరేంద్రమోదీకి బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు, దేశంలో సామాజిక

మిగతా 3వ పేజీలో..

## బండి తనయుడి భగీరథ్‌పై ఫోక్సో కేసు

- **మైనార్ బాలికపై అత్యాచారం జరిపినట్లు ఫిర్యాదు**

**హైదరాబాద్, మే 9 సిరి న్యూస్ :**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, తెలంగాణ బీజేపీ కీలక నేత బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పై పోక్సో కేసు నమోదు అయినట్లు సమాచారం. ఒక 17 ఏళ్ల బాలికకు బలవంతంగా మద్యం తాగించి, హైదరాబాద్‌లోని మొయినాబాద్ ఫామ్‌హౌస్‌తో పాటు మరికొన్ని ప్రాంతాల్లో ఆమెపై అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు వొస్తున్నాయి. ఈ వేధింపుల కారణంగా బాధితురాలు రెండుసార్లు ఆత్మహత్యకు యత్నించినట్లు సమాచారం. చివరికి గత అర్ధరాత్రి ఆమె పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయితే, మొదట్లో బండి భగీరథ్‌పై కేసు నమోదు చేసేందుకు పోలీసులు వెనుకాడటంతో పోలీస్ స్టేషన్ వద్ద సుమారు ఆరు గంటల పాటు హైడ్రామా చోటుచేసుకుంది. ఆ తర్వాత బాధితురాలి నుంచి ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అయితే ఈ కేసు అనంతరం బండి సంజయ్ కొడుకు భగీరాథ్ మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాడు. ఇంతకుముందు కూడా కాలేజీలో ఓ విద్యార్థిపై దాడి చేసి భగీరథ్ వార్తల్లో నిలిచిన సంగతి తెలిసిందే. అయితే భగీరథ్‌పై పాత వివాదాల నేపథ్యంలో దర్శకుడు రామ్ గోపాల్ వర్మ గతంలో చేసిన ట్వీట్ ఇప్పుడు మళ్లీ వైరల్‌గా మారింది. భగీరథ్‌ను ఇరాక్ మాజీ నియంత సద్దాం హుస్సేన్ కుమారుడు ఉదయ్ హుస్సేన్‌తో పోలుస్తూ ఆర్జీవీ అప్పట్లో చేసిన పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా నిలిచింది.

## 'బేటీ బచావో' నినాదం ఎటు పోయింది?

**మొదటిపేజీ తరువాయి**

సంజయ్ కుమారుడిపై మీరు ఎలాంటి చర్య తీసుకోబోతున్నారు? అతనికి మినహాయింపు ఉంటుందా? బండి సంజయ్ ఎప్పుడు రాజీనామా చేస్తారు లేదా మంత్రివర్గం నుంచి ఎప్పుడు బర్తరఫ్ చేయబడతారు? అని కేటీఆర్ ప్రశ్నల వర్షం కురిపించారు.

రాహుల్ గాంధీ, తెలంగాణలో మీ పార్టీ ఎలాంటి 'జంగిల్ రాజ్' నడుపుతోంది? ఒక మైనర్ బాలిక అన్ని ఆధారాలతో వచ్చినప్పుడు పోలీస్ శాఖ అత్యంత వేగంగా ఎందుకు స్పందించలేదని అన్నారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడిపై ఇతర పోక్సో నేరస్తుల మాదిరిగానే కేసు నమోదు చేసి ఎందుకు విచారణ జరపడం లేదని అన్నారు. మైనర్ బాలికపైనే ఎదురు కేసు ఎందుకు పెట్టారు? ఉన్నావ్ కేసులో చేసినట్లుగా, రాహుల్ గాంధీ హైదరాబాద్ వచ్చి బాధితురాలికి, ఆమె కుటుంబానికి అండగా నిలబడాలన్నారు. తెలంగాణ కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీకి ఒక ఫ్రాంచైజీలా పనిచేస్తోందని, ఒక మైనర్ బాలిక గౌరవం విషయంలో కాంగ్రెస్, బిజెపి ఒక అపవిత్రమైన, అసహ్యకరమైన ఒప్పందానికి వచ్చాయని మండిపడ్డారు.

ఒక 17 ఏళ్ల అత్యాచార బాధితురాలు, ఆమె కుటుంబం, ఒక ఎఫ్ఐఆర్ నమోదు చేయించుకోవడానికే మూడు నెలలకు పైగా ఎందుకు పోరాడాల్సి వస్తోందని ప్రశ్నించారు. మనం ఎంతటి దుర్భరమైన, భయంకరమైన నరకంలో జీవిస్తున్నామో ఆ కుటుంబం కష్టం చూస్తే అర్థమవుతుందని అన్నారు. బాధితురాలిని ఆమె కుటుంబాన్ని నేరస్తుల్లా చూస్తూ ఎందుకు వేధిస్తున్నారని నిలదీశారు. ఆ మైనర్ బాలిక రెండుసార్లు ఆత్మహత్యాయత్నం చేసింది. న్యాయం కోసం వారు మూడు నెలలుగా తిరుగుతున్నారు. ఇప్పుడు మీరు ఆమెనే నిందిస్తున్నారు. ఏ నిబంధన ప్రకారం తెలంగాణ పోలీసులు ఒక మైనర్ బాలికపై హనీట్రాప్, వసూళ్ల కేసు నమోదు చేశారు? అని కేటీఆర్ ప్రశ్నించారు. మన మహిళల గౌరవం కోసం గతంలో అణచివేతదారులతో, ప్రభుత్వాలతో పోరాడామని ఇప్పుడు ఆడబిడ్డల రక్షణ కోసం అవసరమైతే మరో మిలియన్ సార్లు మళ్లీ పోరాడుతామని కేటీఆర్ స్పష్టం చేశారు.

## సిగ్నల్ ఫ్రీ సిటీగా హైదరాబాద్

**మొదటిపేజీ తరువాయి**


వసతులను అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. హైదరాబాద్ నగరాన్ని ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దేందుకు యత్నిస్తున్నామని చెప్పారు. సిగ్నల్ ఫ్రీ సిటీగా హైదరాబాద్ నగరాన్ని తీర్చిదిద్దే ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామన్నారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. అండర్ పాస్, సర్ఫేస్, ఎలివేటెడ్ అనే త్రీ లెవెల్ విధానాన్ని తీసుకురావాలని నిర్ణయించు కున్నామని చెప్పారు. ట్రాఫిక్ నియంత్రణకు కేవలం రోడ్ల విస్తరణ మాత్రమే సరిపోదని.. మల్టీ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్‌ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని సీఎం వెల్లడించారు.

పార్కింగ్ ఇబ్బందులను అధిగమించేందుకు నగరంలో మల్టీ లెవెల్ పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రాన్ని మూడు భాగాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. ప్యూర్,క్యూర్, రేర్ అభివృద్ధిని మూడు భాగాలుగా విభజించుకున్నామన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు ఏరియాను సర్వీస్ సెక్టార్‌గా గుర్తించా మన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు బయట, రీజనల్ రింగ్ రోడ్డు లోపల ఉన్న ఏరియాను మాన్యూఫ్యాక్చర్ సెక్టార్‌గా గుర్తించామని తెలిపారు. రీజనల్ రింగ్ రోడ్డు బయట ఉన్న ఏరియాను అగ్రికల్చర్ సెక్టార్‌గా గుర్తించామని అన్నారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధికి సంబంధించి తెలంగాణ రైజింగ్ 2047 మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరించుకున్నామని ముఖ్యమంత్రి అన్నారు. మూసీ రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేయడంతో పాటు మన సంస్కృతికి అనుసంధానం చేయబోతున్నట్లు తెలిపారు.

నగరంలో కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో ఆర్టీసీలో ఈవీ బస్సులను తీసుకొస్తున్నామని అన్నారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో ఆటోలకు ఉచితంగా రెట్రో ఫిట్టింగ్ చేయించి ఈవీ వాహనాలుగా మార్చబోతున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.ఆధునికీకరణ, పట్టణీకరణతో భవిష్యత్‌లో మరిన్ని కొత్త సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సచివాలయంలో నిర్వహించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కమిటీ ఛైర్మన్ మాగుంట శ్రీనివాసులురెడ్డి, సీఎస్ రామకృష్ణారావు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజరయ్యారు. గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాలపై సమావేశంలో చర్చించారు.

## నేడు హైదరాబాద్ కు ప్రధాని

**మొదటిపేజీ తరువాయి**



బహిరంగ సభలో మోదీ పాల్గొని ప్రసంగించనున్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో అటు పోలీసులు, ఇటు ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశాయి. ప్రధాని మోదీ ఆదివారం మధ్యాహ్నం 2:50 నిమిషాలకు ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా సభ జరిగే పరేడ్ గ్రౌండ్స్‌కు బయలుదేరుతారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో పోలీసులు అత్యంత కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. పరేడ్ గ్రౌండ్స్ పరిసరాల్లో మూడంచెల భద్రతా వలయాన్ని నిర్మించారు. సుమారు 2,000 మందికి పైగా పోలీసులతో పాటు, ప్రత్యేక రక్షణ బృందాలు, స్నైపర్లు, ముఫ్తీ పోలీసులు, క్విక్ రెస్పాన్స్ టీమ్స్ రంగంలోకి దిగాయి. ప్రధాని పర్యటన, బహిరంగ సభ కారణంగా సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ ఈ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి. ముఖ్యంగా బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి పరేడ్ గ్రౌండ్స్ వరకు వెళ్లే ప్రధాన రహదారులతో పాటూ సికింద్రాబాద్ పరిసరాల్లో వాహనాల రాకపోకలను నియంత్రించనున్నారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు

# సంజయ్ కు సన్ స్ట్రోక్!

**మొదటిపేజీ తరువాయి**



రావడం బీజేపీ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది.

**పేట్ బషీరాబాద్‌లో నమోదైన పోక్సో కేసు**

బాధితురాలి తల్లిదండ్రులు మేడ్చల్ జిల్లాలోని పేట్ బషీరాబాద్ పోలీసులను ఆశ్రయించి సంచలన ఆరోపణలు చేశారు. తమ మైనర్ కూతురిని (17 ఏళ్లు) మొయినాబాద్‌లోని ఒక ఫామ్ హౌస్‌కు మరియు మరో రెండు ప్రాంతాలకు తీసుకెళ్లి, అక్కడ ఆమెకు మద్యం తాగించి లైంగిక దాడికి పాల్పడ్డాడని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వేధింపుల కారణంగా తమ కుమార్తె తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై రెండుసార్లు ఆత్మహత్యాయత్నానికి కూడా పాల్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు మొదట కేసు నమోదులో తాత్సారం చేసినా, బాధితులు కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించడంతో బీఎన్ఎస్ 74, 75 సెక్షన్లతో పాటు పోక్సో చట్టంలోని సెక్షన్ 11, 12 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

**హనీట్రాప్ అంటూ భగీరథ్ ఎదురు దాడి**

అయితే, తనపై వచ్చిన ఆరోపణలను సాయి భగీరథ్ పూర్తిగా ఖండించారు. పేట్ బషీరాబాద్‌లో కేసు నమోదు కావడానికి ముందే ఆయన కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో తనపై హనీట్రాప్ కుట్ర జరుగుతోందని ఫిర్యాదు చేశారు. ఆ అమ్మాయి తనకు ఒక కామన్ ఫ్రెండ్ ద్వారా పరిచయమైందని, తామిద్దరం కలిసి విజయవాడ, అరుణాచలం వంటి ఆధ్యాత్మిక ప్రదేశాలకు వెళ్లామని ఆయన పేర్కొన్నారు. కొంతకాలం తర్వాత ఆ అమ్మాయిని వివాహం చేసుకోవాలని ఆమె తల్లిదండ్రులు తనపై ఒత్తిడి తెచ్చారని, అందుకు నిరాకరించడంతో రూ. 5 కోట్లు డిమాండ్ చేస్తూ బ్లాక్ మెయిల్ చేశారని భగీరథ్ ఫిర్యాదులో తెలిపారు. గతంలో భయపడి ఆ అమ్మాయి తండ్రికి రూ. 50 వేలు చెల్లించానని, కానీ ఇప్పుడు భారీ మొత్తం కోసం తనపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఆయన వాదించారు.

**నేడు ప్రధాని మోడీ పర్యటన వేళ..**

ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటనకు విచ్చేస్తున్న తరుణంలో, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు కావడం రాజకీయంగా తీవ్ర కలకలం రేపుతోంది. మైనర్ బాలికపై లైంగిక వేధింపుల ఆరోపణలతో పాటు, ఈ వ్యవహారంలో హనీట్రాప్, రూ. 5 కోట్ల బ్లాక్‌మెయిల్ కోణాలు వెలుగులోకి రావడం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. గతంలోనూ సాయి భగీరథ్ ర్యాగింగ్ కేసుల్లో చిక్కుకోవడం, ఇప్పుడు ఏకంగా పోక్సో వంటి తీవ్రమైన కేసు నమోదు కావడంతో ప్రధాని పర్యటన వేళ బండి సంజయ్‌కు ఇది పెద్ద తలనొప్పిగా మారింది.

**పరువు పోతుందనే ఆందోళనలో బండి**

ఈ ఉదంతం ఇప్పటికే ఢిల్లీలోని బీజేపీ అధిష్టానం దృష్టికి వెళ్లినట్లు తెలుస్తోంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా కీలక బాధ్యతల్లో ఉన్న బండి సంజయ్, తన సొంత కుమారుడిపైనే ఇటువంటి నేరారోపణలు రావడంతో అధిష్టానం పెద్దల వద్ద పరువు పోతుందనే ఆందోళనలో ఉన్నట్లు సమాచారం. పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించే ఈ పరిణామాలపై కేంద్ర పెద్దలు సీరియస్‌గా ఉన్నారని, దీనిపై పూర్తి స్థాయి నివేదికను కోరినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**కేంద్ర మంత్రి పదవికి రాజీనామా డిమాండ్**

ఈ ఉదంతం రాజకీయంగా పెద్ద దుమారం రేపుతోంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉంటూ శాంతిభద్రతలను పర్యవేక్షించాల్సిన బండి సంజయ్, నేరచరిత్ర కలిగిన తన కుమారుడిని ఇంట్లో పెట్టుకోవడం ఏంటని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. సోషల్ మీడియాలో బండి సంజయ్‌ను తక్షణమే పదవి నుండి తప్పించాలనే డిమాండ్ ఊపందుకుంది. గతంలో ర్యాగింగ్ కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తికి కేంద్ర మంత్రి హోదాలో ఉన్న తండ్రి అండగా నిలుస్తున్నారని, ఇప్పుడు కూడా బాధితులపైనే ఎదురు కేసులు పెట్టించడం ద్వారా అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**పోలీసుల విచారణలో కీలక అంశాలు**

ప్రస్తుతం ఈ కేసులో పోలీసులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. బాధితురాలి వాంగ్మూలాన్ని రికార్డ్ చేయడంతో పాటు, ఘటనా స్థలాల్లో లభించే ఆధారాలు, కాల్ డేటా మరియు ఇతర డిజిటల్ ఆధారాలను సేకరిస్తున్నారు. మరోవైపు కరీంనగర్ పోలీసులు భగీరథ్ ఫిర్యాదు మేరకు ఆ యువతి మరియు ఆమె తల్లిదండ్రులపై బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. రెండు వైపులా భిన్నమైన వాదనలు వినిపిస్తుండటంతో, అసలు ఇది పథకం ప్రకారం జరిగిన 'హనీట్రాప్' లేక ఒక మైనర్ బాలికపై జరిగిన దారుణమా? అనేది విచారణలో తేలాల్సి ఉంది.



## రాష్ట్రంలో పంట మార్పిడికి ఇదే సరైన సమయం

**మొదటిపేజీ తరువాయి**

సచివాలయంలో అందజేశారు.రాష్ట్రంలో ప్రస్తుతం రైతులు ప్రధానంగా వరి, పత్తి పంటలపై ఆధారపడుతున్న నేపథ్యంలో, ఉద్యాన పంటలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనె గింజల పంటల సాగును ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలపై వ్యవసాయ కమిషన్ సమగ్ర నివేదిక రూపొందించింది.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు (Minister Thummala Nageshwar Rao) మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఖరీఫ్, రబీ సీజన్లలో కలిపి సుమారు 1.30 కోట్ల ఎకరాల్లో వరి సాగు జరుగుతోందని, వొచ్చే మూడు సంవత్సరాల్లో అందులో కనీసం 13 లక్షల ఎకరాలను ఉద్యాన పంటలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, ఆయిల్‌సీడ్స్ సాగుకు మళ్లించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులను ఆదేశించారు. పంట మార్పిడిలో మార్కెట్ లో డిమాండ్ ఉండే పంటలు సూచిస్తే రైతులకు గిట్టుబాటు ధర లభించే అవకాశం వుంది కనుక అటువంటి పంటలు మరియు దేశ ప్రాంత అవసరాలు దృష్టిలో పెట్టుకొని ప్రణాళిక చెయ్యాలని మంత్రి సూచించారు. అదేవిధంగా ఈ సంవత్సరంలో 45 వేల ఎకరాలలో కొత్తగా ఆయిల్ పామ్ సాగును తీసుకురాగా.. వచ్చే సంవత్సరంలో 1 లక్ష ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు చేసేలా ప్రణాళిక తయారుచేసి, దానిని సాధించాలని అన్నారు. కేంద్రం తయారుచేసిన విత్తనచట్టంలో కూడా మార్పులు చేయాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. ఈ చట్టంలో నకిలీ విత్తనాల వలన రైతులు నష్టపోతే, రైతులకు చెల్లించాల్సిన పరిహారం విషయంలో ఎలాంటి స్పష్టత లేదన్నారు. విత్తన నియంత్రణలో కేంద్రంతో పాటు రాష్ట్రాలకు కూడా సముచిత అధికారాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వొచ్చే ఖరీఫ్ సీజన్ కి సంబంధించి జూన్ మొదటి వారంలో నాట్లు వేసే అవకాశాలు ఉన్నందున, మే నెలాఖరు వరకు రాష్ట్రంలో తగినంత యూరియా బఫర్ నిల్వలు సిద్ధంగా ఉంచుకోవాలని వ్యవసాయశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. రాష్ట్రానికి కేటాయించిన యూరియా కేటాయింపులకు అనుగుణంగా కేంద్రం సరఫరా చేసేలా కేంద్ర అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని, అవసరమైతే ఢిల్లీకి వెళ్లి నేరుగా కేంద్ర అధికారులను కలిసి, యూరియా సరఫరాలో జాప్యం జరగకుండా చూసేలా కోరాలని మంత్రి సూచించారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయ్యే యూరియాలో తెలంగాణ రాష్ట్రానికి 90 శాతం కేటాయించి, సరఫరా చేయాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని మంత్రి డిమాండ్ చేశారు. సమావేశంలో సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, వ్యవసాయశాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, ఉద్యానశాఖ డైరెక్టర్ యాస్మీన్ బాషా, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి, ఇతర వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

## 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పని వేళల పెంపు

**హైదరాబాద్, మే 9 సిరి న్యూస్:**

రాష్ట్రంలో భూముల ధరల సవరణ నిర్ణయంతో రిజిస్ట్రేషన్లకు విపరీతమైన డిమాండ్ పెరిగిన నేపథ్యంలో, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రిజిస్ట్రేషన్ల రద్దీ ఎక్కువగా ఉన్న 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పని వేళలను పొడిగిస్తున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు.

రాష్ట్రంలో భూముల ధరలను సవరించాలని, కొన్ని ప్రాంతాల్లో వాస్తవ ధరలతో పోలిస్తే భారీగా హెచ్చుతగ్గులున్న భూముల ధరలను క్రమబద్ధీకరించాలని రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయంతో రిజిస్ట్రేషన్లకు భారీగా డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

అధిక రద్దీ ఉన్న చంపాపేట్, సరూర్‌నగర్, వనస్థలిపురం, గండిపేట్, మహేశ్వరం, ఫరూఖ్‌నగర్, షాద్‌నగర్, రంగారెడ్డి రూరల్, ఎల్‌బీనగర్, శేరిలింగంపల్లి, సంగారెడ్డి, ఘట్‌కేసర్, నల్గొండ ఆర్.ఓ., పటాన్‌చెరు, కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు పని వేళలను ఈ నెల 12వ తేదీ నుంచి పొడిగిస్తున్నట్లు వెల్లడించారు. ఈ పదిహేను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో అవసరమైతే మరింత సమయాన్ని పెంచడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

అదేవిధంగా ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని స్లాట్ బుకింగ్‌ల సంఖ్యను కూడా పెంచాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కూడా రిజిస్ట్రేషన్ల రద్దీ పెరిగిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను గుర్తించి, అవసరానికి అనుగుణంగా అదనపు సమయాన్ని పెంచాలని సూచించారు. అలాగే వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ జరిగే తహసీల్దార్ కార్యాలయాలను కూడా సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పారదర్శకత, వేగం, ప్రజలకు సౌకర్యం ప్రధాన లక్ష్యాలుగా ప్రభుత్వం పనిచేస్తోందని దీనికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రిజిస్ట్రేషన్ల ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు ను మంత్రి పొంగులేటి ఆదేశించారు.



# తమిళనాట కొత్త చరిత్ర!

**ప్రత్యేక ప్రతినిధి సిరి న్యూస్:**

తమిళనాట ఒక కొత్త చరిత్ర లిఖించబడబోతోంది. వెండితెరపై అలరించిన రియల్ హీరో, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ ఇప్పుడు ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించబోతున్నారు. తొలిసారి ఎన్నికల బరిలోకి దిగి, ఐదు దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న ద్రవిడ పార్టీలను మట్టి కరిపించి విజయ్ ఈ ఘనత సాధించారు. తమిళ ఓటర్లు ఆయనకు అధిక మెజారిటీ కట్టబెట్టడంతో, రాష్ట్రంలో ఒక కొత్త నాయకత్వంలో ప్రభుత్వం కొలువుదీరనుంది.

**సంఖ్యా బలంపై ఉత్కంఠ.. చివరకు సుఖాంతం**

తమిళనాడు అసెంబ్లీలో మొత్తం 234 స్థానాలు ఉండగా, ప్రభుత్వం ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. విజయ్ పార్టీ టీవీకే 108 స్థానాల్లో విజయం సాధించింది. అయితే విజయ్ రెండు చోట్ల పోటీ చేసి గెలవడంతో, సాంకేతికంగా ఆయన పార్టీ బలం 107కు తగ్గింది. మ్యాజిక్ ఫిగర్‌కు కావాల్సిన సంఖ్యా బలం లేకపోవడంతో తొలుత గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇవ్వలేదు. దీంతో సంఖ్యా బలం నిరూపించుకునేందుకు విజయ్ రాజకీయ లెక్కలు ప్రారంభించారు.

**కూటముల మార్పు..**

**విజయ్ వైపు మొగ్గిన పార్టీలు**

ఈ సంక్షోభ సమయంలో అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. కాంగ్రెస్ పార్టీ డీఎంకే కూటమి నుండి బయటకు వచ్చి విజయ్‌కు మద్దతు ప్రకటించింది. అటు సీపీఐ, సీపీఎం పార్టీలు కూడా తమ మద్దతును తెలిపాయి. కీలకమైన వీసీకే పార్టీ నేత తిరమావళవన్ మొదట ఉపముఖ్యమంత్రి పదవి కోసం పట్టుబట్టినప్పటికీ, చివరకు తమిళ ప్రజలకు స్థిరమైన పాలన అందించే ఉద్దేశంతో బేషరతు మద్దతు ప్రకటించారు. వీసీకే మద్దతుతో విజయ్ బలం 118కి చేరగా, ఐయూఎంఎల్ కూడా మద్దతు తెలపడంతో మొత్తం సంఖ్య 120కి చేరి ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగమమైంది.

**రాహుల్ గాంధీకి ఆహ్వానం.. ప్రముఖుల రాక**

తన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని విజయ్ ఆహ్వానించారు. వీరితో పాటు మాజీ ముఖ్యమంత్రి స్టాలిన్, పళనిస్వామి వంటి రాజకీయ నాయకులకు, సినీ రంగంలోని ప్రముఖులకు టీవీకే నేతలు ఆహ్వానాలు పంపుతున్నారు. సుమారు 20 మంది మంత్రులతో విజయ్ తన కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. మద్దతు ఇచ్చిన నాలుగు పార్టీలకు కేబినెట్‌లో ప్రాధాన్యత కల్పించనున్నారు.

**ప్రమాణ స్వీకారానికి ముహూర్తం ఖరారు**

నేడు చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇందుకు సంబంధించి స్టేడియంలో ఇప్పటికే భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. సంఖ్యా బలం స్పష్టంగా ఉండటంతో గవర్నర్ సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో దేశం మొత్తం ఇప్పుడు తమిళనాడు వైపు, ముఖ్యంగా విజయ్ పట్టాభిషేకం వైపు ఆసక్తిగా చూస్తోంది.



# ప్రధాని మోదీకి కవిత బహిరంగ లేఖ

**మొదటిపేజీ తరువాయి**

న్యాయ సాధనకు సంబంధించిన నాలుగు కీలక అంశాలను తక్షణమే పరిగణలోకి తీసుకోవాలని ఆమె కోరారు.

ప్రధానమంత్రి మే 10న తెలంగాణ పర్యటనకు రానున్న నేపథ్యంలో ఈ లేఖను విడుదల చేశారు. సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరిగే బహిరంగ సభలో మోదీ పాల్గొననున్నారు. తెలంగాణ ప్రజలకు, దేశవ్యాప్తంగా వెనుకబడిన వర్గాల సంక్షేమానికి సంబంధించి ముఖ్యమైన అంశాలను బాధ్యతగల పౌరురాలిగా మీ దృష్టికి తీసుకొస్తున్నానని కవిత లేఖలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె నాలుగు ప్రధాన డిమాండ్లను ప్రస్తావించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల నీటిపారుదల పథకానికి జాతీయ హోదా కల్పించాలని కోరారు. 2027 జనాభా లెక్కల్లో ప్రత్యేక ఓబీసీ కాలమ్‌ను చేర్చాలని విజ్ఞప్తి చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ఓబీసీ ఉపకోటాతో తిరిగి ప్రవేశపెట్టాలని సూచించారు. తెలంగాణలో వెనుకబడిన తరగతుల బిల్లులకు రాష్ట్రపతి ఆమోద ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. జల భద్రత, డేటా ఆధారిత న్యాయం, లింగ సమానత్వం, రాజ్యాంగ రక్షణలు దేశ సమాఖ్య స్ఫూర్తిని బలోపేతం చేస్తాయని కవిత పేర్కొన్నారు. తాను చేసిన విజ్ఞప్తులను కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



# దసరాలోపు పనులు ప్రారంభించకపోతే పాదయాత్రే: రేవంత్ సర్కారుకు కవిత హెచ్చరిక

- **పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు సాధన సభలో తీవ్ర విమర్శలు**

**హైదరాబాద్, మే 9 సిరి న్యూస్:**

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని టీఆర్ఎస్ నేత కల్వకుంట్ల కవిత తీవ్ర విమర్శలు చేశారు. దసరాలోపు లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులు ప్రారంభించకపోతే ప్రాజెక్టు పరిధిలో పాదయాత్ర చేపడతామని ఆమె హెచ్చరించారు.

షాద్‌నగర్ నియోజకవర్గం చౌదరిగూడెం మండలం లక్ష్మీదేవిపల్లిలో టీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు సాధన సభ'లో కవిత పాల్గొని మాట్లాడారు. గత రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రాజెక్టు పనులు పూర్తిగా నిలిచిపోయాయని ఆరోపించారు.

ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలనే డిమాండ్‌ను కూడా ఆమె పునరుద్ఘాటించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం భారీ నిధులు ఖర్చు చేసినా, ఆశించిన స్థాయిలో నీటి వినియోగం జరగలేదని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా తట్టెడు మట్టి కూడా ఎత్తలేదని విమర్శించారు. "కృష్ణమ్మ పరవళ్లు తొక్కి ప్రవహిస్తున్నా ఆ నీటిని వినియోగించలేని పరిస్థితి నెలకొంది" అని కవిత వ్యాఖ్యానించారు. పాలమూరు ప్రజలకు అన్యాయం జరిగిందని, దానిని సరిచేస్తామని తెలిపారు.

దసరాలోపు లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులు ప్రారంభించకపోతే ప్రాజెక్టు పరిధిలో పాదయాత్ర చేపడతామని, ప్రతి నియోజకవర్గంలో ప్రజలను కలుస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని ఆమె హెచ్చరించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కూడా ఆమె విమర్శలు గుప్పించారు. పాలమూరు ప్రజలకు న్యాయం చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు.

# నాసిక్ టీసీఎస్ కేసుపై రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు

**మొదటిపేజీ తరువాయి**

నాసిక్ టీసీఎస్ కుట్ర వెనుక ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీతో పాటు మాజీ ఎంపీ ఇంతియాజ్ జలీల్ హస్తం ఉందని రాజాసింగ్ సంచలన ఆరోపణలు చేశారు. దేశ భద్రతకు ముప్పు కలిగించే ఉగ్రవాద మూలాలున్న అంశాల్లో ఎవరినీ వదిలిపెట్టకూడదని వ్యాఖ్యానించారు. ఒవైసీ, ఇంతియాజ్ జలీల్‌లను వెంటనే అరెస్ట్ చేసి విచారణ చేపట్టాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రిని కోరారు. దేశ భద్రత విషయంలో ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని ఆయన అన్నారు. ఒవైసీ సోదరులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తే ఆయన రాజకీయ భవిష్యత్తుకు ముప్పు తప్పదని హెచ్చరించారు. గతంలో ఒవైసీలతో సన్నిహితంగా ఉన్న నాయకులు రాజకీయంగా నష్టపోయిన విషయాన్ని




గుర్తు చేశారు. ఇక బీజేపీ నేతలకు కూడా రాజాసింగ్ సూచనలు చేశారు. ఎవరైనా బీజేపీ నేతలు ఒవైసీని రహస్యంగా కలిస్తే అది పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధమని పేర్కొన్నారు. అలాంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు.

# పాట్నా ఐఐటీ క్యాంపస్‌లో హైదరాబాద్ విద్యార్థి మృతి

- **క్రికెట్ ఆడుతుండగా ప్రమాదవశాత్తు స్తంభానికి తాకడంతో విద్యుదాఘాతం**
- **మృతుడిని చందానగర్‌కు చెందిన హర్షిత్ రాజ్‌గా గుర్తింపు**
- **తల్లిదండ్రులకు సమాచారం అందించిన పోలీసులు**

**హైదరాబాద్, మే 9 సిరి న్యూస్:**

బీహార్ లోని పాట్నా ఐఐటీ క్యాంపస్‌లో హైదరాబాద్‌కు చెందిన విద్యార్థి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. క్యాంపస్‌లో క్రికెట్ ఆడుతుండగా ప్రమాదవశాత్తు స్తంభాన్ని తాకడంతో కరెంట్ షాక్ కు గురై ప్రాణాలు విడిచాడు. మృతుడిని నగరంలోని చందానగర్‌కు చెందిన



హర్షిత్ రాజ్‌గా గుర్తించారు. ఈరోజు ఉదయం ఆరు గంటలకు ఈ విషాద ఘటన చోటు చేసుకున్నట్లు ఐఐటీ పాట్నా సెక్యూరిటీ ఇన్‌ఛార్జ్ దీపక్ కుమార్ చౌరాసియా నగర పోలీసులకు సమాచారం ఇచ్చారు. క్రికెట్ ఆడుతూ విద్యార్థి విద్యుదాఘాతానికి గురై కుప్పకూలిపోయినట్లు పోలీసులు తెలిపారు. వెంటనే అతనిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. విద్యార్థి తల్లిదండ్రులకు, స్థానిక పోలీసులకు ఐఐటీ పాట్నా అధికారులు సమాచారం ఇచ్చారు.

# జీపీ కార్యదర్శుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్!

**తెలంగాణ బ్యూరో (సిరి న్యూస్):**

రాష్ట్రంలో చాలా కాలంగా ఎదురుచూస్తున్న పంచాయతీ కార్యదర్శుల బదిలీల ప్రక్రియకు ప్రభుత్వం ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కీలక ఆదేశాలు జారీ చేస్తూ, బదిలీలు కోరుకునే వారు ఈ నెల 15వ తేదీలోగా తమ ఆప్షన్లను అందజేయాలని స్పష్టం చేసింది.

**బదిలీలకు అర్హతలు ఇవే..**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం, ప్రస్తుతం పనిచేస్తున్న స్థానంలో మూడేళ్ల సర్వీసును పూర్తి చేసుకున్న కార్యదర్శులు బదిలీలకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. కంపల్సరీ ట్రాన్స్‌ఫర్ పరిధిలోకి వచ్చేవారు, భార్యాభర్తలు ఒకే చోట పనిచేయాలని కోరుకునే వారు (స్పౌజ్ కేటగిరీ), అలాగే వ్యక్తిగత కారణాల రీత్యా బదిలీ కావాలనుకునే వారు నిర్ణీత ఫార్మాట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.





జిల్లా అధికారులు ఈ దరఖాస్తులను స్వీకరించి, ధ్రువీకరించిన తర్వాత 15వ తేదీ సాయంత్రంలోపు కమిషనర్ కార్యాలయానికి పంపాలని ప్రభుత్వం ఆదేశించింది.

**జిల్లాల వారీగా ఖాళీల వివరాలు**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12,760 గ్రామ పంచాయతీల్లో 2026 మే 1 నాటికి మొత్తం 1,213 పంచాయతీ కార్యదర్శి పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. నల్గొండ జిల్లాలో అత్యధికంగా 85 పోస్టులు ఖాళీగా ఉండగా, కుమ్రంభీం జిల్లాలో 78, కామారెడ్డిలో 68, జనగామలో 64 ఖాళీలు ఉన్నాయి. సంగారెడ్డిలో అత్యల్పంగా 12 ఖాళీలు ఉండగా, హన్మకొండ, వరంగల్, మంచిర్యాల జిల్లాల్లో 14 చొప్పున పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో అసలు గ్రామ పంచాయతీలే లేనప్పటికీ, అక్కడ 18 ఖాళీలు చూపించడం ఇప్పుడు అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**జోన్ల వారీగా పోస్టుల లభ్యత**

బదిలీల ప్రక్రియ కోసం జోన్ల వారీగా ఖాళీలను ప్రభుత్వం ప్రకటించింది. యాదాద్రి జోన్‌లో అత్యధికంగా 258 ఖాళీలు ఉండగా, రాజన్న సిరిసిల్ల జోన్‌లో 216, కాళేశ్వరం జోన్‌లో 208 ఖాళీలు ఉన్నాయి. భద్రాద్రి జోన్‌లో 164, జోగులాంబ జోన్‌లో 160, బాసర జోన్‌లో 126 పోస్టులు ఉండగా, చార్మినార్ జోన్‌లో అత్యల్పంగా 81 ఖాళీలు ఉన్నట్లు నివేదిక స్పష్టం చేస్తోంది. బదిలీల ప్రక్రియ ప్రారంభం కావడంతో పంచాయతీ కార్యదర్శుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

# పనివాళ్లుగా చేరి.. కోట్లు దోచేస్తున్న నేపాలీ ముఠాలు

**హైదరాబాద్, మే 9 సిరి న్యూస్:**


నగరంలోని సంపన్నులు నివసించే జూబ్లీహిల్స్, నందగిరి హిల్స్ ప్రాంతాల్లో వరుస హత్యలు, దోపిడీ ఘటనలు కలకలం రేపుతున్నాయి. పని మనుషులుగా ఇళ్లలో చేరుతున్న కొందరు నేపాలీలు విశ్వాసాన్ని దుర్వినియోగం చేస్తూ భారీ చోరీలు, హత్యలకు పాల్పడుతున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలుతోంది. గత మూడు నెలల్లో జరిగిన మూడు ప్రధాన ఘటనలు నగర ప్రజల్లో ఆందోళన పెంచుతున్నాయి.


ఫిబ్రవరి 6న నందగిరి హిల్స్‌లో ఓ వ్యాపారి ఇంట్లో పనిచేస్తున్న భూపిందర్ షా అనే నేపాలీ యువకుడు ఇతర పనివారికి మత్తుమందు ఇచ్చి సుమారు రూ.2 కోట్ల విలువైన బంగారు ఆభరణాలతో పరారైన ఘటన సంచలనం సృష్టించింది. అనంతరం మార్చి 14న జూబ్లీహిల్స్‌లో మరో వ్యాపారి ఇంట్లో పనిచేస్తున్న ఇద్దరు నేపాలీలు యజమాని లేని సమయంలో లాకర్లు పగులగొట్టి రూ.3 కోట్ల విలువైన నగలను దోచుకెళ్లారు.

తాజాగా మే 8న విశ్రాంత ఐపీఎస్ అధికారి ఇంట్లో పనిచేస్తున్న నేపాలీ యువతి యజమాని భార్యను హత్య చేసి నగదు, బంగారు ఆభరణాలతో పరారైన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ మూడు ఘటనల వెనుక ఒకే ముఠా హస్తం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

దర్యాప్తులో భాగంగా నిందితుల పనితీరుపై కీలక విషయాలు బయటపడుతున్నాయి. ముందుగా ధనిక కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని పనివాళ్లుగా ఇళ్లలో చేరుతున్న ముఠా సభ్యులు, కొన్ని వారాల పాటు నమ్మకంగా పనిచేస్తూ ఇంట్లోని పరిస్థితులు, నగదు, నగల నిల్వలపై సమాచారం సేకరిస్తున్నట్లు గుర్తించారు. యజమానులు బయటకు వెళ్లిన సమయంలో తమ అనుచరులతో కలిసి దోపిడీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు.

ఈ కేసుల్లో అరెస్టయిన నిందితులను విచారించగా, నేపాల్‌లో ఉన్న కొందరు మాస్టర్‌మైండ్‌లు ఈ ముఠాలను నడిపిస్తున్నట్లు సమాచారం లభించింది. పనికి వెళ్లే వ్యక్తుల ఎంపిక నుంచి, దోపిడీ అనంతరం పోలీసులకు చిక్కకుండా ఎలా తప్పించుకోవాలన్న దానివరకు మార్గనిర్దేశం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దోచుకున్న సొత్తుతో పుణె, ముంబై నగరాల్లో తలదాచుకుంటున్నట్లు అనుమానిస్తున్నారు. గతంలో నగర పోలీసులకు సవాల్‌గా మారిన రాజస్థాన్‌కు చెందిన 'ముఖియా గ్యాంగ్' తరహాలోనే ఇప్పుడు నేపాలీ ముఠాలు కొత్త తలనొప్పిగా మారాయి. నిందితులు నేపాల్‌కు పారిపోతే వారిని తిరిగి తీసుకురావడం అంతర్జాతీయ నిబంధనల కారణంగా క్లిష్టమవుతోందని అధికారులు చెబుతున్నారు. అయినప్పటికీ, ఈ ముఠాలను పట్టుకునేందుకు నగర పోలీసులు 'ఆపరేషన్ నేపాల్' పేరుతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు.





# హైదరాబాద్ ట్రాఫిక్‌లో చిక్కుకున్న చంద్రబాబు కాన్వాయ్

- **మోదీ పర్యటన ట్రయల్ రన్‌తో బంజారాహిల్స్‌లో గందరగోళం**

**హైదరాబాద్, మే 9 సిరి న్యూస్:**

ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో నిర్వహించిన భద్రతా ట్రయల్ రన్ కారణంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కాన్వాయ్ హైదరాబాద్ ట్రాఫిక్‌లో చిక్కుకుంది. శనివారం బంజారాహిల్స్ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

వివరాల్లోకి వెళితే, ప్రధాని పర్యటనకు సంబంధించి భద్రతా ఏర్పాట్లలో భాగంగా పోలీసులు బంజారాహిల్స్ మార్గంలో కాన్వాయ్ ట్రయల్ రన్ నిర్వహించారు. అదే సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కాన్వాయ్ కూడా ఆ మార్గంలో రావడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. కమ్యూనికేషన్ లోపం కారణంగా ముందస్తు సమాచారం లేకపోవడంతో వాహన శ్రేణి ముందుకు కదలలేని పరిస్థితి ఏర్పడింది.

సుమారు 10 నిమిషాల పాటు ట్రాఫిక్‌లోనే కాన్వాయ్ నిలిచిపోయింది. ట్రాఫిక్ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ముఖ్యమంత్రి చంద్రబాబు తన వాహనం నుంచి కిందకు దిగినట్లు సమాచారం. వెంటనే భద్రతా సిబ్బంది ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు చర్యలు తీసుకున్నారు.కొద్దిసేపటి తర్వాత ట్రాఫిక్ క్రమబద్ధీకరించడంతో చంద్రబాబు కాన్వాయ్ అక్కడి నుంచి ముందుకు సాగింది. ఉన్నతాధికారుల మధ్య సమన్వయ లోపమే ఈ పరిస్థితికి కారణమైందని తెలుస్తోంది.

## హైదరాబాదులో 15 లక్షల టన్నుల 'చెత్త' కొండ

- **హైదరాబాద్ గచ్చిబౌలిలో 15 లక్షల టన్నుల నిర్మాణ వ్యర్థాలు**
- **ఐకియా సమీపంలో ఆరంతస్తుల ఎత్తులో పేరుకుపోయిన చెత్త**
- **తొలగింపునకు ఏడాదికి పైగా సమయం పట్టే అవకాశం**
- **పరిష్కారానికి రూ.70 నుంచి రూ.90 కోట్ల వరకు ఖర్చు అంచనా**
- **ప్రధాన అడ్డంకిగా మారిన భూ వివాదం**

**హైదరాబాద్ సిరి న్యూస్**

హైదరాబాదులో 15 లక్షల టన్నుల చెత్త కొండ ఎక్కడుందో తెలుసా? అది ఎక్కడో మారుమూల ప్రాంతంలో కాదు, హైటెక్ హంగులతో నిత్యం మెరిసిపోయే గచ్చిబౌలి ఐటీ కారిడార్‌లోనే ఉంది. ఐకియా స్టోర్‌కు సమీపంలో, ఆకాశహర్మ్యాల మధ్య పేరుకుపోయిన ఈ నిర్మాణ వ్యర్థాల (C&D) గుట్టలు ఇప్పుడు నగరం ముందున్న అతిపెద్ద సవాళ్లలో ఒకటిగా నిలిచాయి. కొన్నేళ్లుగా ఇక్కడ పేరుకుపోయిన ఈ వ్యర్థాలు దాదాపు ఆరు నుంచి ఏడు అంతస్తుల ఎత్తుకు చేరాయి. రోజూ వేలమంది ప్రయాణించే ఈ మార్గంలో ఇవి సాధారణ దృశ్యంగా



మారాయి. అధికారుల అంచనా ప్రకారం, ఈ 15 లక్షల టన్నుల చెత్తను తొలగించడానికి, అనువైన పరిస్థితుల్లో కూడా ఏడాదికి పైగా సమయం పట్టవచ్చు.ఈ సమస్య పరిష్కారానికి రెండు మార్గాలను పరిశీలిస్తున్నట్లు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కమిషనర్ జి. సృజన తెలిపారు. మొదటిది, వ్యర్థాలను అక్కడికక్కడే ప్రాసెస్ చేసి, ఇసుక వంటి నిర్మాణ సామగ్రిగా మార్చడం. ఇది పర్యావరణానికి మంచిదైనా, చాలా నెమ్మదైన ప్రక్రియ. రెండోది, చెత్తను వేరే ప్రాంతానికి తరలించడం. ఇది వేగంగా పూర్తయినా, రద్దీగా ఉండే ఐటీ కారిడార్‌లో భారీ వాహనాలతో తరలించడం అత్యంత క్లిష్టమైన పని. ఈ మొత్తం ప్రక్రియకు రూ.70 కోట్ల నుంచి రూ.90 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా. అయితే, దీనికి ప్రధాన అడ్డంకిగా భూ వివాదం మారింది. వ్యర్థాలున్న ఈ స్థలంపై ప్రభుత్వం, ప్రైవేటు సంస్థల మధ్య కోర్టులో కేసు నడుస్తోంది. ఈ వివాదం పరిష్కారమయ్యే వరకు శాశ్వత చర్యలు తీసుకోవడం కష్టమని, కోర్టు తీర్పు తర్వాతే స్పష్టత వస్తుందని కమిషనర్ వివరించారు.

# తెలంగాణ రవాణా శాఖ కీలక నిర్ణయం

- **17 లైసెన్స్ సేవలు ఇక పూర్తిగా ఆన్‌లైన్‌లోనే**

**హైదరాబాద్, మే 9 సిరి న్యూస్:**

తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ వాహనదారులకు భారీ ఊరట కల్పించే నిర్ణయం తీసుకుంది. డ్రైవింగ్ లైసెన్స్‌కు సంబంధించిన 17 రకాల సేవలను పూర్తిగా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకొస్తూ 'ఫేస్‌లెస్' విధానాన్ని అమలు చేస్తున్నట్లు రవాణా శాఖ కమిషనర్ డాక్టర్ కె. ఇలంబర్తి వెల్లడించారు.

ఈ విధానం ద్వారా ఇకపై చిన్నచిన్న పనుల కోసం ఆర్టీవో కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, ఆధార్ ధ్రువీకరణతో ఇంటి నుంచే సేవలు పొందవచ్చని తెలిపారు. సేవల్లో పారదర్శకత పెంచడం, ప్రజలకు వేగవంతమైన సేవలు



అందించడం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

కొత్త విధానం కింద లెర్నర్ లైసెన్స్‌లో పేరు, చిరునామా, ఫొటో, సంతకం మార్పులు, డూప్లికేట్ లెర్నర్ లైసెన్స్ జారీ వంటి సేవలను ఆన్‌లైన్‌లో పొందవచ్చు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్, డూప్లికేట్ లైసెన్స్, లైసెన్స్ రీప్లేస్‌మెంట్, పుట్టిన తేదీ మార్పు, బయోమెట్రిక్ వివరాల సవరణ వంటి కీలక సేవలను కూడా ఫేస్‌లెస్ విధానంలో అందుబాటులోకి తీసుకొచ్చారు.

ప్రమాదకర వ్యర్థాల రవాణాకు అవసరమైన హజార్డస్ లైసెన్స్ ఎండార్స్‌మెంట్, డూప్లికేట్ పబ్లిక్ సర్వీస్ వెహికల్ (పీఎస్‌వీ) బ్యాడ్జ్ జారీ, లైసెన్స్ నుంచి వాహన విభాగాల తొలగింపు వంటి సేవలు కూడా ఆన్‌లైన్‌లోనే అందించనున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రస్తుతం ఈ సేవలు 'సారథి' వెబ్‌సైట్ ద్వారా అందుబాటులో ఉండగా, త్వరలోనే 'నెక్స్ట్‌జెన్ ఎంపరివాహన్' మొబైల్ యాప్‌లో కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. దీంతో స్మార్ట్‌ఫోన్ ద్వారానే ఎక్కడి నుంచైనా సేవలను వినియోగించుకునే అవకాశం కలుగుతుంది.కార్యాలయాలపై పని భారం తగ్గించడంతో పాటు మధ్యవర్తుల ప్రమేయాన్ని నివారించి, ప్రజలకు సమయం, శ్రమ ఆదా చేయడమే ఈ ఫేస్‌లెస్ విధానం ప్రధాన ఉద్దేశమని రవాణా శాఖ స్పష్టం చేసింది.

# ఆరోగ్య పరిరక్షణలో మహిళా సంఘాలు






- కానుకుంట, వీరారెడ్డిపల్లిలో ఎన్ఆర్ఎల్ఎం బృందం పర్యటన
- మహిళా సంఘాల పనితీరుపై ప్రశంసలు
- పోషకాహారం, ఆరోగ్య కార్యక్రమాల అమలుపై ప్రత్యేక పరిశీలన

**గుమ్మడిదల, మే 9( సిరి న్యూస్):**

గుమ్మడిదల మండల పరిధిలోని కానుకుంట, వీరారెడ్డిపల్లి గ్రామాలలో నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ బృందం పర్యటించి మహిళా సంఘాల పనితీరు, గ్రామాల్లో అమలు చేస్తున్న ఫుడ్, న్యూట్రిషన్, హెల్త్ అండ్ వాష్ కార్యక్రమాలను శనివారం పరిశీలించింది. గ్రామీణ మహిళల సాధికారత, పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణ దిశగా మహిళా సంఘాలు నిర్వహిస్తున్న కార్యక్రమాలను బృందం సభ్యులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కానుకుంట గ్రామ సంఘాల విజన్ ప్రణాళికను మహిళలు వివరించగా, గ్రామాభివృద్ధిలో మహిళా సంఘాలు చురుకైన పాత్ర పోషిస్తున్న తీరు బృందాన్ని ఆకట్టుకుంది. మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా సామాజిక, ఆర్థిక అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్‌ను పరిశీలించిన ఎన్ఆర్ ఎల్ఎం బృందం, మహిళలు స్వయంగా పండిస్తున్న కూరగాయలు, పోషకాహార పంటలపై అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా మహిళలు రూపొం దించిన మిల్లెట్ బోనం, వెజిటేబుల్ బతుకమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రతిరోజు ఆహారంలో తీసుకోవాల్సిన త్రివర్ణ కూరగాయల ప్రాధాన్యతపై మహిళలు చేపడుతున్న అవగాహన కార్యక్రమాలను బృందం అభినందించింది. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పోషకాహార కార్యక్రమాలపై అధికారులు వివరాలు సేకరించారు. గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు అందిస్తున్న సేవలను మహిళలు ఎలా వినియోగించుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య పరిరక్షణలో మహిళా సంఘాలు తీసుకుంటున్న చొరవ ప్రశంసనీయమని పేర్కొన్నారు. మహిళా సంఘాల ఐక్యత, నిర్వహణ తీరు, గ్రామ స్థాయిలో అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని బృందం సభ్యులు తెలిపారు. తమకు ఉపయోగపడే అనేక కొత్త విషయాలను నేర్చుకున్నామని వారు అభిప్రాయప డ్డారు. ఈ కార్యక్రమంలో కానుకుంట సర్పంచ్ పెంటారెడ్డి, ఉప సర్పంచ్ పాషా, నేషనల్ మిషన్ మేనేజర్ వసుధ శుక్లా, వివిధ రాష్ట్రాల యాంకర్ పర్సన్స్, స్టేట్ నోడల్ పర్సన్ సురేఖ, జూనియర్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు పి. రాజు, ఆర్. మాధురి, ఎన్ఐఆర్డీ వెంకటేశ్వర్, జిల్లా అధికారులు ఏపీఎం హెచ్‌డీ వెంకట్, ఏపీఎం ఐబీ శివకుమార్, ఏపీఎం నరేందర్ కుమార్, సీసీలు భాగ్యలక్ష్మి, వరలక్ష్మి, వీఓఏలు కల్పన, మహేశ్వరి, రేఖ, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం





- పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్, ఆదర్శ్ రెడ్డి
- విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి అండగా ఉంటామని హామీ

**రామచంద్రపురం, మే 9 (సిరి న్యూస్):**

తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీ శ్రీ శ్రీ గోవిందమాంబ సమేత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి, బీఆర్ఎస్ పటాన్చెరు నియోజకవర్గ ఇంచార్జి ఆదర్శ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో విశ్వబ్రాహ్మణుల పాత్ర విశిష్టమైందని అన్నారు. వారి అభ్యున్నతి, సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. ఆలయ అభివృద్ధికి కూడా సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షిస్తాయని ఆదర్శ్ రెడ్డి అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు యువతకు సన్మార్గాన్ని చూపిస్తాయని పేర్కొన్నారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే జీఎంఆర్‌తో పాటు ఆదర్శ్ రెడ్డిని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రీశైలం చారి, గోపాల్ చారి, ప్రకాష్ చారి, భీమ్ లింగం చారి, శ్రీరాములు చారి, శివశంకర్ చారి పాల్గొన్నారు. అలాగే సీనియర్ నాయకులు సోమిరెడ్డి, దేవేందర్ యాదవ్, లచ్చిరామ్ నాయక్, మల్లారెడ్డి, బాబ్జి, మాజీ ప్రజాప్రతినిధులు, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు తదితరులు హాజరయ్యారు.

# మినీ వాటర్ ప్లాంట్ ఏర్పాటు







- ముఖ్య అతిథిగా పాల్గొన్న సునితా లక్ష్మారెడ్డి

**వెల్దుర్తి మే,09,( సిరి న్యూస్)**

వెల్దుర్తి మండల కేంద్రంలో గల వెంకటేశ్వర నర్సింగ్ హోమ్ అధినేత కీర్తిశేషులు డాక్టర్ చిప్ప నరసింహులు పెద్ద కుమారుడు డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్ తన తండ్రి జ్ఞాపకార్థం మండల కేంద్రంలో వారి యొక్క సొంత షట్టర్ యందు ప్రయాణికుల కొరకై మినీ వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి నర్సాపూర్ శాసనసభ్యురాలు సునీత లక్ష్మారెడ్డి, గ్రామ సర్పంచ్ ఆదర్శ ఉప సర్పంచ్ శ్రవణ్ కుమారులు ముఖ్య అతిథులుగా పాల్గొని ఈ మినీ వాటర్ ప్లాంట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ★డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ తన తండ్రి 40 సంవత్సరాలుగా వైద్య సేవలు మండలానికి అందించారు అని తన మరణాంతరం కొంచెం విరామం ఏర్పడిందని మరల తిరిగి మండలానికి వైద్య సేవలు అందించడానికి త్వరలో మీ ముందుకు వస్తామని, అంతే కాకుండా ఇకనుండి తన తండ్రి జ్ఞాపకార్థం గ్రామంలో అలాగే మండలంలో కొన్ని సేవా కార్యక్రమాలు చేద్దామని ముందుకు వచ్చామని మండల ప్రజలు ఆశీర్వదించి తోడ్పాటుగా ఉండాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు అలాగే గ్రామస్తులు పాల్గొన్నారు.




# అంసాన్పల్లి సహకార సంఘం నూతన కార్యవర్గం



**కొల్చారం కొల్చారం మే 9( సిరి న్యూస్)**

కొల్చారం మండల పరిధిలోని అంసానిపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (PACS) నూతన పాలకవర్గం ఏర్పాటైంది. సంఘం చైర్మన్‌గా మన్నె రాములు, వైస్ చైర్మన్‌గా గంగాపురం నర్స గౌడ్ ఎన్నికయ్యారు. నూతన పాలకవర్గ సభ్యులుగా గడ్డమీద సత్యనారాయణ, కన్యాబోయిన రమేష్, దోమకొండ సంజీవులు, బండ భూమయ్య, గంగాపురం జనార్దన్ గౌడ్, గొల్లపల్లి రుక్కమ్మ, లంబాడి దేవ్ సింగ్, నీరుడి వెంకమ్మ, లంబాడి అంబోర్య సభ్యులుగా ఎంపికయ్యారు.ఈ సందర్భంగా నూతన పాలకవర్గ సభ్యులకు గ్రామ ప్రజలు, రైతులు అభినందనలు తెలిపారు. రైతుల సంక్షేమం, సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని నూతన పాలకవర్గ సభ్యులు తెలిపారు.

# హనుమాన్ మందిరం లో ప్రత్యేక పూజలు.

## యజ్ఞంలో పాల్గొన్న సర్పంచ్ నాయికోటి లావణ్య మధు.



**సదాశివపేట. మే 9. (సిరిన్యూస్)**

సదాశివపేట మండలంలోని ఆరూరు గ్రామంలో హనుమాన్ మందిరం 7వ వార్షికోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. ఉదయాన్నే ఆంజనేయ స్వామికి అభిషేకం నిర్వహించి, చంద్రం దిద్ది స్వామి వారిని అలంకరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆరూర్ సర్పంచ్ నాయికోటి లావణ్య మధు దంపతులు ఆలయంలో యజ్ఞం నిర్వహించారు. గ్రామంలోని ప్రజలందరూ, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు స్వామివారిని దర్శించుకుని ఆశీర్వాదం పొందారు.అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించడం జరిగింది.

# రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్





**పాపన్నపేట మే 09 (సిరి న్యూస్):**

మండలంలోని నాగ్సాన్ పల్లి గ్రామ శివారులో మంజీరా నది నుంచి శుక్రవారం అర్ధరాత్రి సమయంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి వెళ్లి రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని ఠాణాకు తరలించినట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.ట్రాక్టర్ లను సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.మండలంలో మంజీరా నది, చెరువుల నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఎక్కడైనా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

# అవార్డుల పంపిణీ చేసిన సామ్ ఛారిటీ అండ్ వెల్ఫేర్ ట్రస్ట్.




**సదాశివపేట. మే 9. (సిరి న్యూస్)**

సామ్ ట్రస్ట్ ఛారిటీ అండ్ వెల్ఫేర్, సదాశివపేటలోని స్థానిక ఓ ఫంక్షన్ హాల్లో కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో వివిధ రంగాల్లో సేవలందించి, విద్యా రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జాతీయ అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి నియోజకవర్గ శాసనసభ్యుడు చింతా ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామ్ ట్రస్ట్ ముఖ్యంగా వైద్య, విద్యా రంగాలలో పేదలకు సహాయం చేస్తూ, వారికి చికిత్స, విద్య కోసం సౌకర్యాలు కల్పిస్తూ తన సేవలను అందిస్తోందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన సామ్ ట్రస్ట్ అధికారులను అభినందించారు. ప్రభుత్వం నుండి అవసరమైన ఎలాంటి సహాయాన్నైనా స్వీకరించడానికి ట్రస్ట్ సిద్ధంగా ఉందని, ఇదే విధంగా తన సేవలను కొనసాగిస్తుందని సామ్ ట్రస్ట్ చైర్మన్ షేక్ అంజుమ్‌కు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతా సాయి, మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ చింతా గోపాల్, శివరాజ్‌పాటిల్, ఈద్గా కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అక్బర్ హుస్సేన్, ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎస్ఏఎం ట్రస్ట్, మున్సిపాలిటీ సభ్యులు మహమ్మద్ నసీరుద్దీన్, సోమశేఖర్, ఫణికృష్ణ, నాగుల విజయ్ కుమార్, కలీం పటేల్, ముబీన్ మొహియుద్దీన్, ఎ.ఎస్. యజ్దానీ, సంగీత మేమ్, ముహమ్మద్ హాజీ, షేక్ ఖియాస్. బీఆర్ఎస్ నాయకులు మహ్మద్ నిజాముద్దీన్, మోహిని, పుష్ప, మహ్మద్ జలీల్ సహా స్థానిక ప్రముఖులు, రాజకీయ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## అభివృద్ధిని అడ్డుకోవడం సిగ్గుచేటు

**సొంత ప్రయోజనాల కోసం ఆరోపణలు చేయడం సరికాదు**



**(సిరి న్యూస్) కొండాపూర్, మే9:**

సొంత ప్రయోజనాల కోసం ప్రజల పక్షాన ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడినని చెప్పుకోవడం సిగ్గుచేటని సంగారెడ్డి నియోజకవర్గం కాంగ్రెస్ సేవా దళ్ అధ్యక్షుడు ప్రశాంత్ గౌడ్ ఆరోపించారు. శనివారం తొగర్ పల్లి తన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రశాంత్ గౌడ్ మాట్లాడుతూ పరిశ్రమ ఏర్పాటుకు టీజీఐఐసీ చైర్పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సహకారంతో గ్రామ అభివృద్ధి కోసం పరిశ్రమను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉద్యోగ కల్పన కోసం గ్రామ శివారులో ఏర్పాటు చేస్తున్న పరిశ్రమలో యాజమాన్యం నూటికి నూరు శాతం గ్రామ నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. పంచాయతీ పాలకవర్గ సభ్యులకు పరిశ్రమకు మంచి అనుబంధం ఉందని వెల్లడించారు. పరిశ్రమకు కేటాయించిన భూమిలో 44 ఎకరాల మినహా 9 ఎకరాల వివిధ కులమతాల ఆలయాలకు దారి ఇచ్చేందుకు యాజమాన్యం సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. గత ప్రభుత్వాలయంలో గ్రామానికి చెందిన రెండు ఎకరాల భూమిని ఇతర గ్రామానికి కేటాయించినప్పుడు ఎందుకు ప్రశ్నించలేదన్నారు. పోలీసులు,రెవెన్యూ యంత్రాంగాన్ని రాజకీయ ఉద్దేశం సొంత ప్రయోజనాల కోసం ఆరోపణలు చేయడం సరికాదని హెచ్చరించారు. గ్రామంలోని నిరుద్యోగులకు, పరిశ్రమకు అవసరమయ్యేయంత్రాలను ఉపయోగించుకునే అవకాశం ఇచ్చేందుకు యాజమాన్యం ముందుగానే పంచాయతీకి హామీ ఇచ్చినట్లు తెలిపారు. లేనిపోని ఆరోపణలు, వాస్తవాలను ప్రేరేపించడం సరికాదని,ఆత్మ కమిటీ,మార్కెట్ కమిటీ చైర్మన్ లు ఎల్లవేళలా మండల అభివృద్ధికి కృషి చేస్తున్నారని వారిపై దుష్ప్రచారం చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.ఈ సమావేశంలో పంచాయతీ పాలకవర్గం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## అంతు చూస్తానని సర్పంచ్ బెదిరింపుతో కేసు

**ఆత్మహత్య చేసుకున్న తాడ్మన్నూర్ రాంచెందర్**

**జోగిపేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన మృతుడి బార్య**

**జోగిపేట, మే 09, (సిరి న్యూస్ ):**



తాడ్మన్నూర్ గ్రామానికి చెందిన రాంచెందర్ (56) ఆత్మహత్యకు తాడ్మన్నూర్ గ్రామ సర్పంచ్ అనీల్‌రెడ్డి బెదిరింపులే కారణమని మృతుడి భార్య కమ్మరి గోవిందమ్మ జోగిపేట పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం రాత్రి ఫిర్యాదు చేసారు. ఈ కేసులో సర్పంచ్ అనీల్‌రెడ్డితో పాటు రోళ్లపాడ్ గ్రామానికి చెందిన బేతయ్యపై కేసు నమోదు అయినట్లు ఎస్ఐ పాండు శనివారం తెలిపారు. నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం వెతుకుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. తాడ్మన్నూర్ గ్రామానికి చెందిన దత్తు బేతయ్య ఇంటి నిర్మాణం చేస్తానని చెప్పి రూ.2.50 లక్షలు తీసుకొని కట్టలేదు. ఈ కేసులో దత్తుపై చీటింగ్ కేసు నమోదు అయ్యింది. ఆ విషయంలో దత్తు తాడ్మన్నూర్ గ్రామానికి చెందిన రాంచెందర్‌కు కూడా రూ.80వేలు బాకీ ఉన్నాడు. అనీల్‌రెడ్డి అతడి వద్దకు వచ్చి ఎవరికి డబ్బులు ఇవ్వకూడదని, నీకు నేను బెయిల్ ఇప్పిస్తానని బేతయ్య అనీల్‌రెడ్డికి ఫోన్ చేసి లేనిపోని చాడీలు చెప్పాడు. సర్పంచ్ అనీల్‌రెడ్డి బేతయ్య ఫోన్ లైన్‌లో ఉండగానే రాంచెందర్‌కు కాన్ఫరెన్స్ కాల్ చేసి ఇష్టం వచ్చినట్లు తిట్టడమే కాకుండా నీవు సోడిగాడివి...నీ అంతు చూస్తానని రాంచెందర్ భార్య వింటుండగానే తిట్టగా నా భర్తను తిట్టకు అని చెప్పినా నీ మొగుడు సోడిగాడు భయభ్రాంతులకు గురి చేయగా తీవ్ర మనస్థాపం చెంది గుర్తు తెలియని మందును గురువారం అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో సేవించగా కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే జోగిపేట, సంగారెడ్డి ఆసుపత్రులకు తరలించగా పరిస్థితి విషమంగా ఉందని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం నాడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రాంచెందర్ మృతి చెందారు. పోస్టుమార్టం అనంతరం శనివారం సాయంత్రం మృతదేహాన్ని గ్రామానికి తరలించారు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు అనీల్‌రెడ్డి, బేతయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## ప్రపంచంలోనే భారత గౌరవాన్ని నిలబెట్టిన వ్యక్తి నరేంద్ర మోడీ.

**బిజెపి మండల అధ్యక్షుడు కర్ణం ఆదిత్య.**

**సదాశివపేట. మే 9. (సిరిన్యూస్)**



ఆదివారం జరగబోయే బహిరంగ సభకు భారీ ఎత్తున ప్రజలు స్వచ్ఛందంగా బయలుదేరడం జరుగుతుందన్నారు.ఈ సందర్భంగా కర్ణం ఆదిత్య మాట్లాడుతూ ప్రజల భద్రత, దేశ అభివృద్ధి, ప్రపంచంలో భారత గౌరవాన్ని పెంచేందుకు నిరంతరం కృషి చేస్తున్న నాయకుడు నరేంద్ర మోడీ.పేదల సంక్షేమం నుంచి యువత భవిష్యత్తు వరకు, రైతుల అభ్యున్నతి నుంచి దేశ రక్షణ వరకు ప్రతి రంగంలో ధైర్యమైన నిర్ణయాలతో ముందుకు సాగుతున్నారు.సబ్కా సాథ్ సబ్కా వికాస్ అనే లక్ష్యంతో ప్రతి భారతీయుని సంక్షేమమే తన ధ్యేయంగా పనిచేస్తూ, దేశ ప్రజలందరికీ నమ్మకమైన రక్షకుడిగా నిలిచిన వ్యక్తి మోడీ భారత దేశాన్ని శక్తివంతమైన, స్వావలంబన దేశంగా తీర్చిదిద్దే దిశగా ఆయన నాయకత్వం కోట్లాది ప్రజలకు స్ఫూర్తిగా నిలిచాడు అని అన్నారు.

# శిశు విక్రయాలు జరిపితే కఠిన చర్యలు

- వాళ్లు ఎంతటి వారైన ఊరుకునేది లేదు
- ఇలాంటి ఘటనలు పునరావృతమైతే చర్యలు తప్పవు..
- సమగ్ర విచారణ జరిపి ఏ పార్టీ వారైన చర్యలు తీసుకోవాలి..
- మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు



**మెదక్ మే,09(సిరిన్యూస్)**

నవ మాసాలు మోసి బిడ్డకు జన్మనిచ్చిన తల్లులకు విషాదం నింపే విధంగా ఆసుపత్రి సిబ్బంది వ్యవహరిస్తే ఏ పార్టీ వారైనా ఎవరిని ఉపేక్షించేది లేదని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అన్నారు.మెదక్ పట్టణంలో ఓ మహిళ ఆడబిడ్డకు జన్మనివ్వగా చనిపోయింది అంటూ ప్రైవేట్ ఆస్పత్రికి సిబ్బంది ఆడ శిశువును ఇతరులకు అమ్ముకున్న ఘటనపై ఎమ్మెల్యే రోహిత్ తీవ్రంగా ఖండించారు. ఇప్పటికే బాధ్యులపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.రాబోయే రోజుల్లో ఇలాంటి ఘటనలు జరిగితే ఏ పార్టీ వారైన ఎంతటి అధికారులు తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షించి ఇలాంటి ఘటనలు పునరావృతం రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.మానవత్వం మంటగలిగే విధంగా వ్యవహరించిన ఆసుపత్రికి సిబ్బంది ప్రవర్తించిన తీరు నాకెంతో బాధ కలిగించిందన్నారు. నవ మాసాలు మోసిన ఆ కన్నతల్లి సంతోషం లేకుండా కన్నీళ్లు మిగిల్చిన వారిని వదిలిపెట్టకుండా కఠినంగా శిక్షించాలని ఆయన అధికారులకు ఆదేశించారు. ఈ ఘటనకు పాల్పడిన బాధ్యులు ఎవరైనా వారిని కఠినంగా శిక్షించాలని ఆయన పునరుద్ఘాటించారు.

# సమాధి స్థలం లేక క్రిస్టియన్ మైనార్టీల ఆవేదన..

- గ్రేవ్‌యార్డ్ కోసం 10 ఎకరాల భూమి కేటాయించాలని విజ్ఞప్తి

**రామచంద్రపురం, మే 9 (సిరి న్యూస్):**



పటాన్చెరు నియోజకవర్గంలోని క్రిస్టియన్ మైనార్టీల కోసం ప్రత్యేక గ్రేవ్‌యార్డ్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ భూమిలో 10 ఎకరాల స్థలం కేటాయించాలని క్రిస్టియన్ సంఘాలు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశాయి.సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం పట్టణంలోని మెథడిస్ట్ చర్చి ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో పలువురు చర్చి పాస్టర్లు, క్రిస్టియన్ సంఘాల ప్రతినిధులు మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పటాన్చెరు నియోజకవర్గంలో సుమారు 50 వేల మంది క్రిస్టియన్ ప్రజలు నివసిస్తున్నప్పటికీ, మృతదేహాలను సమాధి చేసేందుకు సరైన స్థలం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు, కాలేజీల్లో ప్రవేశాలు, చర్చిల పునర్నిర్మాణం, మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ వంటి పలు కార్యక్రమాలతో అండగా నిలుస్తోందని తెలిపారు.అయితే చనిపోయిన వారికి సమాధి చేసేందుకు స్థలం లేకపోవడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. రామచంద్రపురంలో ప్రస్తుతం ఉన్న స్మశానవాటికను ప్రధానంగా బిహెచ్ఎల్ ఉద్యోగులు మాత్రమే వినియోగించుకుంటున్నారని, అక్కడ కూడా ఒక సమాధిని మళ్లీ తవ్వి మరో మృతదేహాన్ని పూడ్చాల్సిన దయనీయ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు.ఈ సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి క్రిస్టియన్ మైనార్టీలకు న్యాయం చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో పటాన్చెరు పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రశాంత్, ఉపాధ్యక్షుడు శంకర్, ప్రధాన కార్యదర్శి జి. జోసెఫ్, అసెంబ్లీ కోఆర్డినేటర్ సుజీవన్ దిన్ను పాల్గొన్నారు. అలాగే పటాన్చెరు క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు నిస్సీ డానియల్, ఉపాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి హారతి, జాయింట్ సెక్రటరీ ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు దిలీప్, శామ్యూల్, విల్సన్, అగస్టిన్, శామ్యూల్ మనోహర్, ప్రవీణ్, రాజు తదితరులు హాజరయ్యారు.

# మిషన్ భగీరథ పైప్ లైన్ మరమ్మత్తులు జరిగినా

- అనంతారంలో మిషన్ భగీరథ నీళ్లు రాక ఇబ్బందులు
- పగిలిన మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు లేక గ్రామస్తుల తీవ్ర ఇబ్బందులు

**గుమ్మడిదల (అనంతారం) మే 9( సిరి న్యూస్**



గుమ్మడిదల మండలంలోని అనంతారం గ్రామంలో మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ దెబ్బతినడంతో గ్రామ ప్రజలు తీవ్ర తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. గత నెల 24 న పైప్‌లైన్ పగిలిపోవడంతో గ్రామానికి మంచినీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయిందని స్థానికులు తెలిపారు. సమస్యను గుర్తించిన గ్రామ సర్పంచ్ కొమ్ము శ్రీనివాస్ వెంటనే సంబంధిత మిషన్ భగీరథ అధికారులకు సమాచారం అందజేశారు. అధికారుల సూచన మేరకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏడవ తేదీన తవ్వి పైప్‌లైన్‌ను బయటకు తీశారు. అయితే మరమ్మతుల కోసం సిబ్బందిని పంపిస్తామని హామీ ఇచ్చిన అధికారులు ఇప్పటివరకు గ్రామానికి రాకపోవడంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. 9వ తేదీన మిషన్ భగీరథ సిబ్బంది స్వయంగా హాజరవుతానని తెలిపినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని సర్పంచ్ తెలిపారు. ఫోన్ ద్వారా పలుమార్లు సంప్రదించినా అధికారులు స్పందించడం లేదని ఆయన పేర్కొన్నారు. వేసవి తీవ్రతతో గ్రామంలో తాగునీటి కొరత రోజురోజుకూ అధికమవుతోందని తెలిపారు. కొందరు ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తుండగా, పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. మరోవైపు పైప్‌లైన్ మరమ్మతుల కోసం తవ్విన రహదారిని అలాగే వదిలేయడంతో గ్రామంలో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి నీరు అందిస్తామని చెబుతున్నా సమస్యలు వచ్చినప్పుడు అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరం అని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి పైప్‌లైన్ మరమ్మతులు పూర్తి చేసి గ్రామానికి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అనంతారం గ్రామంలో నెలకొన్న మంచినీటి సమస్యను జిల్లా ఉన్నతాధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్దుర్తి యందు సమ్మర్ క్యాంప్

- పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. సాంబయ్య వెల్లడి.

**వెల్దుర్తి, మే 09, (సిరి న్యూస్)**



విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, వ్యక్తి వికాసాన్ని పెంపొందించేందుకు పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్దుర్తి యందు ప్రత్యేక వేసవి సమ్మర్ క్యాంపు నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య తెలిపారు. ఈ సమ్మర్ క్యాంపు ఈ నెల 11 మే 2026 నుండి 25 మే 2026,వరకు మొత్తం పదిహేను రోజులు పాటు కొనసాగనుంది. వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోనేలా రూపొందించిన ఈ శిబిరంలో పలు రకాల శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. ముఖ్యంగా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు వ్యక్తిత్వ వికాస తరగతులు, మానసిక ప్రశాంతత కోసం యోగా, ధ్యానం, కళా ప్రతిభలను వెలికి తీసే సంగీత శిక్షణ శారీరక ధృడత్వాన్ని పెంచే క్రీడా కార్యక్రమాలు, డాన్స్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం విద్యార్థులు విద్యాభ్యాసంతో పాటు మానసిక,శారీరక అలాగే సామాజిక అభివృద్ధి దిశగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని అందుకే ఈ సమ్మర్ క్యాంపును సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా రూపొందించినట్లు వివరించారు. ప్రతిరోజు ప్రత్యేక నిపుణుల ఆధ్వర్యంలో తరగతి నిర్ణయించి విద్యార్థులకు ఉపయోగపరమైన శిక్షణ అందించనున్నట్టు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యమని తెలియజేశారు. కావున తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా ఈ శిబిరాన్ని పంపించాలని పాఠశాల యాజమాన్యం కోరుతుంది. ఈ శిక్షణ కార్యక్రమం యందు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరూ హాజరు కాగలరు. ఈ శిక్షణ కార్యక్రమము ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగుతుందని స్నాక్స్ ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. కావున ఈ సమ్మర్ క్యాంపును గ్రామంలోని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.సాంబయ్య తెలియజేశారు.

# సొంతింటి కల ఇందిరమ్మ ఇంట్లో అడుగు వేసే వేళ

**మునిపల్లి, మే 9 (సిరి న్యూస్):**

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశానుసారం మునిపల్లి మండలంలోని పోల్కంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఎంసి చైర్మన్ సుధాకర్ రెడ్డి రెండు ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రామ్ రెడ్డి, మునిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పిల్లోడు సతీష్ కుమార్, ఉపాధ్యక్షుడు రసూల్ పటేల్, గ్రామ సర్పంచ్ వీరేశం, ఉప సర్పంచ్ ఆనందం, నాయకులు సంఘన్న, సుదర్శన్, రమేష్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబానికి మాజీ ఎంపీ పరామర్శ

**భీంపూర్,(సిరి న్యూస్ ):** మండలంలోని వడ్గావ్ గ్రామానికి చెందిన సలాం మాణిక్రావు ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే, రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపూరావు శనివారం వారి నివాసానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాణిక్రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట డీసీసీబీ మాజీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, నాయకులు అరుణ్, ఇతర నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.



# మోదీ సభను విజయవంతం చేయండి



**గంభీరావుపేట,(సిరి న్యూస్ ):** దేశ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న నేపథ్యంలో తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా చేపట్టనున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. దాదాపు రూ.7,800 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేందుకు, అలాగే తెలంగాణలో పార్టీ బలోపేతం కోసం ప్రధాని మోదీ రానున్న సందర్భంగా ప్రతి కార్యకర్త, ప్రతి అభిమాని ముందుకు రావాలని బీజేపీ మండల అధ్యక్షుడు కోడె రమేష్ కోరారు. ప్రతి గ్రామం, ప్రతి వాడ నుంచి భారీ సంఖ్యలో ప్రజలను సమీకరించి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సభ ప్రాంగణం జనసంద్రంగా మారేలా అందరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. "దేశ అభివృద్ధి కోసం–మోదీతో ముందుకు.. బలమైన భారత్ కోసం–మన ఓటు, మన మద్దతు" అంటూ నాయకులు నినాదాలు చేశారు. ఇది సాధారణ సభ కాదని, దేశ భవిష్యత్తును నిర్ణయించే మహాసభ అని పేర్కొన్నారు. అందరూ కలిసి పాల్గొని సభను చరిత్రలో నిలిచేలా విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి దేవసాని కృష్ణ, బిద్ధి నర్సింలు, డాక్టర్ సత్యనారాయణ, సర్వోత్తమ్ శ్రీనివాస్, దేవేందర్ నాయక్, శ్రీనివాస్ చారి, రాజు, బాలయ్య, శంకర్, దేవేందర్ యాదవ్, రవీందర్ నాయక్, మల్లేష్ గౌడ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# 11 నుంచి విద్యా వారోత్సవాలు నిర్వహించాలి

**ఆదిలాబాద్,(సిరి న్యూస్ ):** ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలో నిర్వహించనున్న విద్యా వారోత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో కలెక్టర్ తన క్యాంపు కార్యాలయం నుంచి పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 11 నుంచి 17 వరకు నిర్వహించనున్న విద్యా వారోత్సవాల్లో భాగంగా 'జయ శంకర్ బడిబాట', 'లైబ్రరీ డే', తల్లిదండ్రుల సమావేశాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించని విద్యార్థుల కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలని, విద్యాసంస్థల్లో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, సర్పంచులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. జనగణన–2027 ప్రక్రియలో భాగంగా సెల్ఫ్ ఎన్యుమరేషన్ను ప్రతిఒక్కరూ పూర్తి చేసేలా అవగాహన కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగులందరూ తప్పనిసరిగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ఏఈఓలకు స్పష్టమైన లక్ష్యాలను కేటాయించి రోజువారీ నివేదికలు సమర్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఆర్ఎస్. చిత్రూ, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామి, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ సుధారాణి, విద్య, రవాణా, మార్కెటింగ్ తదితర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోలు ప్రక్రియ మరింత వేగవంతం చేయాలి

- **రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి**
- **జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల,(సిరి న్యూస్ ):** జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. శనివారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మంచిర్యాల నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తోందన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణ బాధ్యతలను స్వయం సహాయక సంఘాలకు అప్పగించామని, అధికారులు పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని నిబంధనల ప్రకారం పరిశీలించి నాణ్యత, తేమ శాతం నమోదు చేసి టోకెన్లు అందించాలని తెలిపారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాల నుంచి గోదాములు, రైస్ మిల్లులకు ధాన్యం తరలింపు సమర్థవంతంగా చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో సాగవుతున్న వరి పంటలో దాదాపు 65 శాతం మంచిర్యాల నియోజకవర్గంలోనే సాగవుతోందని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 12 రైస్ మిల్లులు పనిచేస్తున్నాయని, ప్రతి మిల్లు రోజుకు కనీసం 10 లారీల ధాన్యాన్ని దిగుమతి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో 6 గోదాములు అందుబాటులో ఉన్నాయని, జైపూర్లోని సుముఖ గోదాములో 35వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నిల్వ చేయవచ్చన్నారు. ఇప్పటి వరకు 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తయిందని, ఈ నెలాఖరు నాటికి 80 శాతం కొనుగోలు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అకాల వర్షాల కారణంగా రైతుల ధాన్యం తడవకుండా గోదాముల్లో నిల్వ చేస్తున్నామని, అవసరమైతే కొత్త గోదాములను గుర్తించి నిల్వ సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు. లారీలు, ట్రాక్టర్ల ద్వారా ధాన్యం తరలించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, హమాలీల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాల్లో కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో అధికారులు సిద్ధంగా ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, రాములు, రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్యతో పాటు వ్యవసాయ శాఖ అధికారులు, తహశీల్దార్లు, రైస్ మిల్లర్ల అసోసియేషన్, లారీ అసోసియేషన్ ప్రతినిధులు, ఐకేపీ సభ్యులు పాల్గొన్నారు.



# సింగరేణిలో కొత్త గనులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం







- **అనుమతుల ప్రక్రియ వేగవంతం చేయాలని యాజమాన్యానికి ఆదేశాలు**

**మంచిర్యాల,(సిరి న్యూస్ ):** సింగరేణి సంస్థ ఉజ్వల భవిష్యత్తు కోసం కొత్త బొగ్గు గనుల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ముమ్మరంగా సన్నాహాలు చేపడుతోంది. బొగ్గు నిల్వలు తగ్గిపోవడంతో మూతపడుతున్న గనుల స్థానంలో కొత్త గనులను ప్రారంభించి ఉత్పత్తిని కొనసాగించడంతో పాటు కార్మికులకు ఉపాధి కల్పించడం, రాష్ట్ర ఇంధన అవసరాలను తీర్చడం లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. కొత్త గనుల అనుమతులకు సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించింది. దీనిపై స్పందించిన యాజమాన్యం సింగరేణి ప్రాంతాల్లో తొమ్మిది కొత్త ప్రాజెక్టులను చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించి, కేంద్ర బొగ్గు, అటవీ, పర్యావరణ శాఖల అనుమతుల కోసం ప్రతిపాదనలు సమర్పించింది. ఈ ప్రాజెక్టుల అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. భట్టి విక్రమార్క ఇప్పటికే రెండుసార్లు ఢిల్లీకి వెళ్లి సంబంధిత శాఖ అధికారులతో సమావేశమై, రాష్ట్ర ఇంధన అవసరాల దృష్ట్యా కొత్త గనులకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని కోరినట్లు సమాచారం. ఇప్పటివరకు మూడు గనులకు అనుమతులు లభించినట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం సింగరేణి భవన్లో సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాష్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ ఏడాదిలోనే మూడు గనుల నుంచి ఉత్పత్తి ప్రారంభించే లక్ష్యంతో మిగిలిన అనుమతులను వెంటనే పొందేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు ఈఎల్ వి సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, గౌతమ్ పోట్రూ, తిరుమల రావు, ఈడీ బి.వెంకన్న, అడ్వైజర్ మోహన్ పరిగెన్, జీఎం కోఆర్డినేషన్ అండ్ మార్కెటింగ్ టి.శ్రీనివాస్, జీఎం సీపీప కొత్తగూడెం జి.దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.




# ఈనెల 20న ఆదిలాబాద్లో మెగా జాబ్ మేళా

- **50కి పైగా కంపెనీలు.. 5వేల ఉద్యోగ అవకాశాలు**
- **మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్**




**ఆదిలాబాద్,(సిరి న్యూస్ ):** నిరుద్యోగ యువతీ యువకులకు ఈనెల 20న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మావలలోని చిలుకూరి లక్ష్మి గార్డెన్స్లో ఈ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో వార్డు అధికారులతో శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. పట్టణ పరిధిలోని 49 వార్డుల నుంచి అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐటీ, ఫార్మా, బ్యాంకింగ్, రిటైల్ తదితర రంగాలకు చెందిన 50కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. సుమారు 5వేలకు పైగా ఉద్యోగ ఖాళీలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. 18 నుంచి 33 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన యువత దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థుల అర్హతలు, నైపుణ్యాలను బట్టి సంవత్సరానికి రూ.1.5 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు వేతనం లభించే అవకాశముందని తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ఈ మేళా ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు. జాబ్ మేళా ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతుందని, అభ్యర్థులు తమ విద్యార్హత ధ్రువపత్రాలతో హాజరై ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఇన్చార్జ్ కమిషనర్ సందీప్, విశ్రాంత స్టెప్ సీఈఓ వెంకటేశ్వర్లు, బీసీ స్టడీ సర్కిల్ ఇన్చార్జ్ ప్రవీణ్, వైస్ చైర్మన్ రోహిత్, కౌన్సిలర్లు ఇజ్జగిరి సంజయ్, మెహబూబ్, పర్వేజ్, గజ్జల విజయ్, వసంత్, సలీం తదితరులు పాల్గొన్నారు.



సంపాదకీయం

## ద్రవిడ గడ్డపై నూతన శకం..
## 'జన నాయగన్' పట్టాభిషేకం

తమిళనాడు రాజకీయ యవనికపై సరికొత్త 'దళపతి' ఉదయించారు. వెండితెరపై కోట్లాది మందిని అలరించిన విజయ్ నేడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడం ఒక చారిత్రక పరిణామం. తమిళనాడు రాజకీయాలు అంటే దశాబ్దాలుగా కేవలం రెండు పెద్ద పార్టీల (డీఎంకె, ఏఐఏడీఎంకె) మధ్యే సాగుతున్న పోరాటం. కానీ 2026 ఎన్నికల ఫలితాలు ఆ సంప్రదాయాన్ని బద్దలు కొట్టాయి. 'తమిళగ వెట్రి కళగంస (టీవీకె) పార్టీని స్థాపించి, మొదటి ప్రయత్నంలోనే కోటను కొల్లగొట్టిన విజయ్, ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పు ఎంత శక్తివంతమైనదో నిరూపించారు. ఎంజీఆర్, కరుణానిధి, జయలలిత వంటి దిగ్గజాలు సినీ నేపథ్యం నుంచి వచ్చి ముఖ్య మంత్రులైనప్పటికీ.. విజయ్ ప్రయాణం భిన్నమైంది. నేటి డిజిటల్ యుగంలో, రాజకీయ చైతన్యం ఉన్న యువతను తనవైపు తిప్పుకోవడం ఆయన సాధించిన అతిపెద్ద విజయం. కేవలం 'అభిమానం' ఓట్లుగా మారదు అనే విమర్శలకు, తన సిద్ధాంతాల ద్వారా ఆయన గట్టి సమాధానం ఇచ్చారు.

**అవకాశాల ఆకాశం.. సవాళ్ల సముద్రం**

ముఖ్యమంత్రిగా విజయ్ ముందు ఇప్పుడు పూలపాన్పు లేదు. ముళ్ల బాట ఉంది. టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ మిత్రపక్షాల (కాంగ్రెస్, వామపక్షాలు) సహకారంతో ప్రభుత్వాన్ని నడపడం ఒక సవాలు. మేనిఫెస్టోలో ప్రకటించిన నిరుద్యోగ భృతి, రైతు రుణమాఫీ వంటి భారీ హామీలను రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెడుతూ అమలు చేయడం కత్తి మీద సామే. మరోవైపు అడ్మినిస్ట్రేషన్‌లో అనుభవం లేని కొత్త ఎమ్మెల్యేలతో, సమర్థవంతమైన పాలనను అందించడం ఆయన రాజకీయ చతురతకు పరీక్ష. విజయ్ విజయం కేవలం ఒక వ్యక్తి గెలుపు కాదు, మార్పు కోరుకునే ఒక తరం ఆకాంక్ష. 'జన నాయగన్' కేవలం వెండితెర బిరుదుగా కాకుండా, ప్రజల మనిషిగా నిరూపించుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. ద్రవిడ ఆత్మగౌరవాన్ని కాపాడుతూనే, అభివృద్ధి పథంలో తమిళనాడును విజయ్ ఎలా నడిపిస్తారో వేచి చూడాలి.

# హాంకాంగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

- ప్రారంభించిన సిఐ సుమన్
- హాజరైన మల్కాపూర్ సర్పంచ్, ఉపసర్పంచ్, పాలకవర్గం
- అద్భుతమైన ఏర్పాట్లు చేసిన ఎకెఎస్ సంస్థ



**(సిరిన్యూస్ )కొండాపూర్, మే 9:**

మండల పరిధిలోని మల్కాపూ ర్ లో క్రీడా ఉత్సాహం వెల్లివిరిసింది. గ్రామంలోని యువతను ప్రోత్సహించే లక్ష్యంతో ఎకెఎస్ సంస్థ నిర్వహించ తలపెట్టిన హాంకాంగ్ క్రికెట్ టోర్నమెంట్ శనివారం ఘనంగా ప్రారంభమైంది.క్రికెట్ ఆడిన కొండాపూర్ సీఐసుమన్ కుమార్ టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించిచారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుండే ప్రతిభావంతులైన ఆటగాళ్లు జాతీయ స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. క్రీడాకారులతో కలిసిపోయి కాసేపు క్రికెట్ ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు.★దాతృత్వానికి నిదర్శనం★ఈ మెగా టోర్నమెంట్ విజయవంతం కావడంలో ఏకెఎస్ కాంట్రాక్టర్ అనిల్ కుమార్ గారి పాత్ర ప్రశంసనీయం. క్రీడల పట్ల ఉన్న మక్కువతో, యువతకు అండగా నిలుస్తూ ఆయన అందించిన ఆర్థిక సహకారం మరియు స్పాన్సర్‌షిప్ పట్ల గ్రామస్తులు మరియు క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయన ఉదారతకు నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**క్రీడా స్ఫూర్తిని చాటాలి..**

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ అనిల్ మాట్లాడుతూ క్రీడలకు సంబదించిన ఎటువంటి ప్రోత్సాహనికైనా పంచాయతీ ముందుంటుందని చెప్పారు. ఈ సందర్భంగా తను ఒకప్పుడు కబడ్డీ బాగా ఆడేవాన్నన్ని గుర్తుచేసుకున్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని ఉపసర్పంచ్ ప్రవీణ్ సూచించారు. గ్రామీణ స్థాయిలోని ప్రతిభావంతులైన ఆటగాళ్లకు ఇది గొప్ప అవకాశం అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా తన మిత్రుడు స్పాన్సర్ అనిల్ ను ప్రశంసించారు. ఈ భారీ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించాలని ఆర్గనైజింగ్ టీమ్ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు.

**నిర్వాహక బృందం కృషి..**

టోర్నమెంట్ ఏర్పాట్లను అత్యంత క్రమశిక్షణతో నిర్వహించిన ఫుర్కాన్, అజ్జు, తస్లీమ్,వారి బృందాన్ని అందరూ అభినందిస్తున్నారు. క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మైదానాన్ని సిద్ధం చేయడంలో, మ్యాచ్‌ల షెడ్యూలింగ్‌లో ఈ టీమ్ చూపిన చొరవ అద్భుతమని అతిథులు కొనియాడారు.ఈ టోర్నమెంట్‌లో సంగారెడ్డి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 48 జట్లు తలపడుతున్నాయి. విజేతలకు భారీ బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు అజగర్, లక్ష్మణ్, దశరథ్, రత్నం, నరేష్, క్రీడాభిమానులు మరియు పెద్ద సంఖ్యలో యువత పాల్గొని ఆటగాళ్లను ప్రోత్సహించారు.

# నిమ్జ్ అభివృద్ధి పనులలో వేగం పెంచాలి

- పనులు త్వరితగతిన పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్
- అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్ష

**సంగారెడ్డి, మే 09, (సిరి న్యూస్):**

జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ (నిమ్జ్) పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి పరిశ్రమల స్థాపనకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. అవసరమైన యంత్రాలు, ఎక్విప్మెంట్‌ను పెంచి ఇన్ఫ్రాస్ట్రక్చర్ వర్క్సను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మౌలిక వసతుల ఏర్పాట్లలో ఎలాంటి జాప్యం లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శనివారం కలెక్టర్ జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ టీజీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.వీ రారెడ్డి తో కలిసి జహీరాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో నిమ్జ్, పరిధిలోని భూముల అభివృద్ధి, సేకరించిన భూముల ప్రస్తుత స్థితి, పెండింగ్ సమస్యలు, స్వాధీనం చేసుకున్న భూముల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు తదితర అంశాలపై టీజీఐఐసీ, నిమ్జ్, రెవెన్యూ మరియు సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకుముందు నిమ్జ్ భూముల మ్యాప్‌ను పరిశీలించిన కలెక్టర్, ఇప్పటివరకు సేకరించిన భూములు, ఇంకా సేకరించాల్సిన భూముల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూసేకరణ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పరిశ్రమల అభివృద్ధికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించి పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాట్లను వేగవంతంగా పూర్తిచేయాలని తెలిపారు. సేకరించిన భూమిలో చుట్టు పూర్తి స్థాయిలో ఫెన్సింగ్ వేయాలని సూచించారు. ఈ సమావేశంలో టీజీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వీరారెడ్డి, జోనల్ మేనేజర్ విఠల్, నిమ్జ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విశాలాక్షి, రెవెన్యూ డివిజనల్ అధికారి దేవూజ, సంబంధిత మండలాల తహసీల్దార్లు, పోలీస్ శాఖ అధికారులు మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# అర్హులందరికీ సంక్షేమ పథకాలు



**బజార్హత్నూర్,(సిరి న్యూస్ ):** అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతా యని, పేద ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తోందని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ అన్నారు. శనివారం బజార్హ త్నూర్ మండలంలోని పిప్రి గ్రామంలో లబ్ధిదారురాలు సీతల విజయ సుమన్ నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదవాడికి సొంతింటి కలను నిజం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తామని తెలిపారు. ప్రజాసేవే పరమావధిగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని, గ్రామ గ్రామాన తిరుగుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుంటున్నానని చెప్పారు. గత పాలకుల నిర్లక్ష్యంతో నిలిచిపోయిన అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి పట్టాలెక్కిస్తోందని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. "ఇందిరమ్మ రాజ్యం అంటేనే పేదల రాజ్యం" అని అన్నారు. రానున్న రోజుల్లో మరింత మందికి గృహ యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం లబ్ధిదారులకు మిఠాయిలు తినిపించి, నూతన గృహంలో సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణకాంత్ రెడ్డి, గిర్నూర్ సర్పంచ్ ప్రియాంక భీమేష్, మండల అధ్యక్షుడు జెల్కే పాండురంగ్తో పాటు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రహదారులపై ధాన్యం ఆరబోస్తే కఠిన చర్యలు

- రాత్రివేళల్లో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు
- ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకోవాలి
- ఎస్పీ పరితోష్ పంకజ్



**సంగారెడ్డి, సిరి న్యూస్:**

రహదారులపై ధాన్యం ఆరబోస్తున్న రైతులు, వ్యాపారులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ హెచ్చరించారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో కొంతమంది రైతులు, వ్యాపారులు రహదారులపైనే ధాన్యం ఆరబోస్తుండటంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా రాత్రి సమయంలో రోడ్లపై ఆరబోసిన ధాన్యం సరిగా కనిపించక వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు అధికంగా ఉన్నాయని పేర్కొన్నారు. రహదారులపై ధాన్యం ఆరబోయడం వల్ల వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడమే కాకుండా ప్రజల ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడుతోందన్నారు. ఈ నేపథ్యంలో రహదారులపై ధాన్యం ఆరబోసి రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రైతులు తమ ధాన్యాన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన నిర్దిష్ట కల్లాల్లో లేదా వ్యవసాయ శాఖ సూచించిన ప్రదేశాల్లోనే ఆరబోసుకోవాలని సూచించారు. ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ కోరారు.


# వీఓఏల సమస్యలు పరిష్కరించాలి



**సత్తుపల్లి,(సిరి న్యూస్ ):** ఐకేపీ వీఓఏల పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మెకు సిద్ధమవుతున్నట్లు తెలంగాణ ఐకేపీ వీఓఏ జేఏసీ నాయకులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఐదు మండలాలకు చెందిన వీఓఏ ప్రతినిధులు సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, మున్సిపల్ చైర్పర్సన్ రెహానా కమల్ పాషాలకు స్థానిక క్యాంపు కార్యాలయంలో శనివారం వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ ఐకేపీ వీఓఏ జేఏసీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి సమావేశంలో సమ్మెపై ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నట్లు నాయకులు తెలిపారు. ప్రభుత్వం తమ డిమాండ్లపై స్పందించకపోతే ఈనెల 18 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా శాంతియుత నిరవధిక సమ్మె చేపడతామని స్పష్టం చేశారు. వీఓఏలకు కనీస వేతనం రూ.20వేలుగా అమలు చేయాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తిస్తూ హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అర్హులైన వీఓఏలకు పదోన్నతులు కల్పించడం, రూ.20లక్షల ఆరోగ్య, సాధారణ బీమా సదుపాయం అందించడం, విధుల నిర్వహణకు ట్యాబ్లు మంజూరు చేయడం, జీఓ నం.58లో సవరణలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం తమ సమస్యలను మానవతా దృక్పథంతో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని వీఓఏ జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు.

## రణబాలి మేకింగ్ వీడియో వచ్చేసింది.. ప్రాణాలను పణంగా పెట్టిన విజయ్ దేవరకొండ

టాలీవుడ్ యువ నటుడు విజయ్ దేవరకొండ ప్రస్తుతం రౌడీ జనార్ధన సినిమాతో పాటు రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో రూపొందుతున్న రణబాలి అనే చిత్రంలో కూడా హీరోగా నటిస్తున్నాడు. ఇందులో రష్మిక మందన్న విజయ్‌కు జోడిగా కనిపించనుండగా, మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈరోజు విజయ్ పుట్టినరోజు సందర్భంగా రణబాలి చిత్ర బృందం ఈ సినిమా నుండి ఓ మేకింగ్ వీడియోను విడుదల చేసింది. అందులో విజయ్ గుర్రంపై స్వారీ చేస్తున్న సన్నివేశాలు కనిపిస్తాయి. అయితే ఆ గుర్రంపై పర్ఫెక్ట్‌గా స్వారీ చేయడానికి ఆయన ఎంత ప్రమాదాన్ని ఎదుర్కొన్నాడో ఈ వీడియోలో చూపించారు. ఈ మేకింగ్ వీడియో ప్రకారం దాదాపు రెండు సార్లు గుర్రం ఎక్కిన సమయంలో అది విజయ్‌ను కింద పడేసింది. దాంతో ఆయన గాయాల పాలయ్యాడు. అయినప్పటికీ పట్టు వదలకుండా అదే గుర్రంపై స్వారీ చేయాలనే దృఢ సంకల్పంతో తీవ్రంగా శ్రమించి చివరకు విజయవంతంగా దానిపై స్వారీ చేశాడు. ఈ మొత్తం ప్రాసెస్‌ను చూపిస్తూ చిత్ర బృందం విడుదల చేసిన ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వీడియో చూసిన అభిమానులు "డెడికేషన్ అంటే ఇదే" అంటూ విజయ్ దేవరకొండపై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఏదేమైనా ఈ వీడియో చూసిన తర్వాత చాలామంది విజయ్ ధైర్యం, కష్టపడే తత్వానికి ఫిదా అవుతున్నారు.




## నెంబర్ 1 ట్రెండింగ్‌లో దూసుకెళ్తున్న అడివి శేష్ డెకాయిట్



అడివి శేష్ నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'డెకాయిట్' ఓటీటీలో సెన్సేషన్ సృష్టిస్తోంది. ఈ చిత్రం మే 8, 2026న అమెజాన్ ప్రైమ్ వీడియోలో విడుదలైన వెంటనే ఇండియా వైడ్ నెంబర్ 1 స్థానాన్ని దక్కించుకుంది. ఓటీటీలోకి వచ్చిన ఈ సినిమా ఇప్పుడు డిజిటల్ స్పేస్‌లో కూడా భారీ విజయాన్ని అందుకుంది. ప్రస్తుతం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో స్ట్రీమింగ్ అవుతున్న ఈ చిత్రానికి సోషల్ మీడియాలో అద్భుతమైన స్పందన లభిస్తోంది.
మంచి కంటెంట్‌ను ఎంపిక చేసుకోవడంలో అడివి శేష్‌కు ఉన్న విజన్ ని మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకుంది. విభిన్న కథలు, బలమైన కథనాలతో ఆయనకు ఉన్న క్రేజ్ 'డెకాయిట్'తో మరింత బలపడింది. ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ కథానాయికగా నటించగా, ఇద్దరి నటన సినిమాకి ప్రధాన బలంగా నిలిచింది. అనురాగ్ కశ్యప్, ప్రకాశ్ రాజ్, సునీల్, అతుల్ కులకర్ణి, జైన్ మేరీ ఖాన్, కామాక్షి భాస్కర్ల వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించారు. దర్శకుడిగా పరిచయమైన షనీల్ డియో ఈ చిత్రాన్ని స్టైలిష్‌గా, గ్రిప్పింగ్‌గా తెరకెక్కించారు. సినిమాటోగ్రాఫర్ ధనుష్ భాస్కర్ విజువల్స్, కొదాటి పవన్ కళ్యాణ్ ఎడిటింగ్, భీమ్స్ సిసిరోలియో సంగీతం సినిమాకి మరింత బలం చేకూర్చాయి. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై సుప్రియా యార్లగడ్డ, సునీల్ నారంగ్ నిర్మించిన ఈ చిత్రంలో ఉన్న హై ప్రొడక్షన్ వాల్యూస్ డిజిటల్ స్క్రీన్‌పైనా స్పష్టంగా కనిపిస్తున్నాయి.

## బాలయ్య-కొరటాల మూవీ.. అస్సలు ఊహించని టైటిల్?





నందమూరి అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్రేజీ కాంబినేషన్ పట్టాలెక్కబోతోంది. మాస్ డైరెక్టర్ కొరటాల శివ దర్శకత్వంలో నటసింహం బాలకృష్ణ హీరోగా ఒక భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఒక పవర్‌ఫుల్ టైటిల్ ఖరారైనట్లు సోషల్ మీడియాలో వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. ఈ చిత్రానికి 'కార్పెంటర్' అనే విభిన్నమైన టైటిల్‌ను ఫిక్స్ చేసినట్లు సమాచారం.
సాధారణంగా కొరటాల శివ సినిమాల్లో బలమైన సామాజిక సందేశంతో పాటు కమర్షియల్ ఎలిమెంట్స్ పుష్కలంగా ఉంటాయి. కార్పెంటర్ అనే టైటిల్‌ను బట్టి చూస్తుంటే.. బాలయ్య పాత్ర ఈసారి చాలా కొత్తగా, లోకల్ సెటప్‌లో అత్యంత పవర్‌ఫుల్‌గా ఉండబోతోందని అర్థమవుతోంది. బాలకృష్ణ మార్క్ డైలాగులు, కొరటాల మార్క్ ఎమోషన్స్ కలిస్తే బాక్సాఫీస్ వద్ద రికార్డులు తిరగరాయడం ఖాయమే. ఇక ఈ సినిమాకు మరో ప్రధాన ఆకర్షణ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్. ప్రస్తుతం సౌత్ ఇండియాలో టాప్ ఫామ్‌లో ఉన్న అనిరుధ్.. బాలయ్య సినిమాకు మ్యూజిక్ అందించబోతుండటం ఇదే తొలిసారి.
బాలకృష్ణ ఎనర్జీకి తగ్గట్టుగా అనిరుధ్ ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ స్కోర్, సాంగ్స్ ఇస్తారోనని అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ కాంబినేషన్ మ్యూజికల్ పరంగా కూడా సెన్సేషన్ క్రియేట్ చేయనుంది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రీప్రొడక్షన్ పనులు ఇప్పటికే పూర్తయ్యాయని, అతి త్వరలోనే రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించేందుకు చిత్ర యూనిట్ సిద్ధమవుతోందని తెలుస్తోంది. అయితే కార్పెంటర్ టైటిల్ విషయంలో మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.

## రామ్ చరణ్ కోసం రంగంలోకి టీమ్ ఇండియా లెజెండ్..




రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న 'పెద్ది' సినిమా ప్రమోషన్లు ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో లేవని మెగా అభిమానులు కొంత అసంతృప్తిగా ఉన్నారు. అయితే, ఈ లోటును పూడ్చేందుకు చిత్ర యూనిట్ ఒక భారీ 'మైండ్ బ్లాకింగ్' ప్లాన్‌తో సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ సినిమా క్రీడా నేపథ్యం (స్పోర్ట్స్ డ్రామా), ముఖ్యంగా క్రికెట్ బ్యాక్‌డ్రాప్‌లో సాగుతుండటంతో, ప్రమోషన్ల కోసం ఒక అరుదైన అతిథిని తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నారు.
తాజా సమాచారం ప్రకారం, జార్ఖండ్ రాజధాని రాంచీలో ఒక భారీ ఈవెంట్‌ను నిర్వహించాలని చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది. ఈ వేడుకకు భారత మాజీ కెప్టెన్, క్రికెట్ దిగ్గజం మహేంద్ర సింగ్ ధోనీ (MS Dhoni)ని ముఖ్య అతిథిగా ఆహ్వానించాలని చూస్తున్నట్టు గట్టిగా వినిపిస్తోంది. ధోనీ స్వస్థలం రాంచీ కావడం, అలాగే సినిమా క్రీడా నేపథ్యంలో ఉండటంతో ఆయన రాక సినిమాకు భారీ హైప్ తీసుకొస్తుందని మేకర్స్ నమ్ముతున్నారు. ప్రస్తుతానికి ధోనీతో సంప్రదింపులు జరుగుతున్నాయని, ఇంకా ఏదీ అధికారికంగా ఖరారు కాలేదని తెలుస్తోంది. ఒకవేళ ధోనీ ఈ ఈవెంట్‌కు హాజరైతే మాత్రం, నార్త్ ఇండియా మార్కెట్‌లో 'పెద్ది' సినిమాకు తిరుగులేని ప్రచారం లభిస్తుందని చెప్పొచ్చు. రామ్ చరణ్ మాస్ ఇమేజ్, ధోనీ క్రేజ్ తోడైతే బాక్సాఫీస్ వద్ద రికార్డులు తిరగరాయడం ఖాయం.


## లాలా అమర్‌నాథ్ బయోపిక్.. మళ్ళీ 'లగాన్' కాంబో రిపీట్ !




బాలీవుడ్ వెండితెరపై ఎన్నో అద్భుతాలు ఆవిష్కృతమయ్యాయి, కానీ అమీర్ ఖాన్ నటించిన 'లగాన్' సినిమా సృష్టించిన ఇంపాక్ట్ మాత్రం ప్రత్యేకం అనే చెప్పాలి. అశుతోష్ గౌరీకర్ దర్శకత్వంలో వచ్చిన ఆ పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామా ఆస్కార్ వరకు వెళ్లి భారతీయ సినిమా గర్వపడేలా చేసింది. మళ్ళీ ఇన్నాళ్ల తర్వాత ఈ సక్సెస్‌ఫుల్ కాంబినేషన్ పునరావృతం కాబోతుందనే వార్త ఇప్పుడు నెట్టింట సెన్సేషన్‌గా మారింది. గత కొంతకాలంగా సరైన హిట్ కోసం ఎదురు చూస్తున్న అమీర్ ఖాన్, తనకి 'లగాన్' వంటి క్లాసిక్ ఇచ్చిన దర్శకుడితోనే మళ్ళీ చేతులు కలపడం ట్రేడ్ వర్గాల్లో ఆసక్తిని రేపుతోంది.
మరింత ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈ సినిమా కూడా క్రికెట్ బ్యాక్‌డ్రాప్‌లోనే ఉండబోతోందట. భారత క్రికెట్ దిగ్గజం, లెజెండరీ ప్లేయర్ లాలా అమర్‌నాథ్ బయోపిక్ ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు సమాచారం. 1947 నాటి పరిస్థితులు, ఆ కాలంలో క్రికెట్ నేపథ్యం చుట్టూ ఈ కథ తిరుగుతుందట. 'లగాన్' సినిమా కూడా పీరియాడిక్ డ్రామాగానే వచ్చి సంచలనం సృష్టించింది, ఇప్పుడు మళ్ళీ అదే జోనర్‌లో ఈ ఇద్దరూ సినిమా చేస్తుండటంతో అమీర్ ఖాన్ బాక్సాఫీస్ వద్ద తన పూర్వ వైభవాన్ని చాటుకోవడం ఖాయమని ఫ్యాన్స్ భావిస్తున్నారు. ప్రస్తుతం చర్చల దశలో ఉన్న ఈ ప్రాజెక్ట్‌పై త్వరలోనే అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చే అవకాశం ఉంది.

## 'పెద్ది' ట్రైలర్‌కు ముహూర్తం ఫిక్స్.. ఈవెంట్ మాత్రం ఇక్కడ కాదండోయ్!

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న మోస్ట్ అవేటెడ్ మల్టీ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది'. జూన్ 4న ఈ సినిమా రిలీజ్ కానుండగా.. ప్రమోషన్ల విషయంలో చిత్ర యూనిట్ అదిరిపోయే ప్లాన్లతో ముందుకు వెళ్తోంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్ లాంచ్‌కు సంబంధించి ఒక సెన్సేషనల్ అప్‌డేట్ బయటకు వచ్చింది. పెద్ది ట్రైలర్‌ను మే 16న గ్రాండ్‌గా విడుదల చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నట్టుగా తెలుస్తోంది.
ట్రైలర్ ఈవెంట్‌ను మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో నిర్వహించబోతున్నారని తెలుస్తోంది. ఈ వేడుకకు హీరో రామ్ చరణ్, హీరోయిన్ జాన్వీ కపూర్, దర్శకుడు బుచ్చిబాబు సహా చిత్ర యూనిట్ హాజరు కానుందని టాక్. నార్త్ ఇండియా మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ లొకేషన్‌ను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. అయితే ఈ ఈవెంట్‌ను కేవలం ఒక సినిమా వేడుకలా కాకుండా.. ఒక మ్యూజికల్ ఫెస్టివల్‌లా నిర్వహించాలని ప్లాన్ చేస్తున్నారట. అందుకోసం ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ లైవ్ పెర్ఫార్మెన్స్ కూడా ఇవ్వబోతున్నారట.
అయితే పెద్ది ట్రైలర్ లాంచ్ డేట్, ఈవెంట్ ఎక్కడ? అనే విషయాల్లో మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది. కానీ బుచ్చిబాబు మాత్రం పెద్ది ట్రైలర్‌ను ఓ రేంజ్‌లో కట్ చేసినట్టుగా సమాచారం. విలేజ్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు ఉండగా.. ట్రైలర్ వచ్చాక అది నెక్స్ట్ లెవల్‌కి వెళ్తుందని ఇండస్ట్రీ ఇన్‌సైడ్ టాక్. మరి రోజు రోజుకి అంచనాలు పెంచేస్తున్న పెద్ది.. బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేస్తుందో చూడాలి.



## 60 శాతం పూర్తయిన 'కల్కి 2'.. ప్రభాస్ నెక్స్ట్ ఫోకస్ దానిపైనే?

ప్రభాస్ ప్రస్తుతం నటిస్తున్న చిత్రాలలో 'కల్కి 2' ఒకటి. ఈ సినిమాకు నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నారు. అమితాబ్ బచ్చన్ ఇందులో కీలకమైన పాత్రలో కనిపించనున్నారు. అలాగే లోకనాయకుడు కమల్ హాసన్ ఈ చిత్రంలో విలన్ పాత్రలో నటిస్తున్నారు. ఈ మూవీ మొదటి భాగం అద్భుతమైన విజయాన్ని సాధించడంతో రెండవ భాగంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం ఇప్పటివరకు ఈ సినిమాకు సంబంధించిన 60 శాతం షూటింగ్ పూర్తయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ప్రభాస్ విదేశీ పర్యటనలో ఉన్నారు.
తిరిగి వచ్చిన తర్వాత సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న 'స్పిరిట్' సినిమా షూటింగ్‌లో జాయిన్ కాబోతున్నట్లు సమాచారం. ఆ సినిమాకు సంబంధించిన షెడ్యూల్ పూర్తైన తర్వాత మళ్లీ 'కల్కి 2' షూటింగ్‌లో పాల్గొననున్నారని తెలుస్తోంది. ఈ రెండు సినిమాలతో పాటు ప్రభాస్, హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న 'ఫౌజీ' చిత్రంలో కూడా హీరోగా నటిస్తున్నారు. ఈ సినిమాను ఈ ఏడాది దసరా లేదా డిసెంబర్ నెలలో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇలా వరుస సినిమాల షూటింగ్‌లతో ప్రభాస్ ప్రస్తుతం చాలా బిజీగా ఉన్నారు.



## ఆయన నాలోని సరికొత్త కోణాలు చూపించారు..



బాలీవుడ్ యంగ్ హీరోయిన్ శార్వరి వాఘ్ 'మై వాపస్ ఆవుంగా' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ చిత్రం జూన్ 12న ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది. ఈనేపథ్యంలో.. తాజాగా, శార్వరి ఈ సినిమాలోని 'మస్కారా' పాట చిత్రీకరణకు సంబంధించిన బిహైండ్ ద సీన్స్ ఫోటోలు, వీడియోలను షేర్ చేస్తూ, దర్శకుడు ఇంతియాజ్ అలీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శార్వరి ఈ పాటలోని ఫీలింగ్ గురించి చెబుతూ, 'కిస్-మిస్ యారా' అనే పదాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇది ఒక కల్పిత పదం అయినప్పటికీ, మొదటిసారి ప్రేమలో పడినప్పుడు మనసులో కలిగే ఆ మధురమైన అలజడిని ఇది అద్భుతంగా వివరిస్తుందని ఆమె అన్నారు. సినిమాలో తన పాత్ర అయిన 'జియా' జీవితంలో ఈ ఎమోషన్ చాలా కీలకం అని, ఆ భావాలను పండించడంలో ఇంతియాజ్ అలీ తనకు ఎంతో సహాయం చేశారని శార్వరి పేర్కొన్నారు.
దర్శకుడు ఇంతియాజ్ అలీ గురించి శార్వరి ఎంతో గొప్పగా రాశారు. "ఇంతియాజ్ సర్ ప్రతి సీన్ వెనుక ఉండే ఎమోషన్‌ను ఎంతో స్పష్టంగా వివరిస్తారు. నాలో ఉన్న సరికొత్త కోణాలను ఆయన నాకు పరిచయం చేశారు. షూటింగ్ సమయంలో ఇంతియాజ్ చూపించిన ఓపిక, నమ్మకం, ప్రేమ నన్ను ఒక మంచి నటిగా తీర్చిదిద్దాయి. ఆయన కథ చెప్పే విధానాన్ని గమనించడం ద్వారా నేను చాలా నేర్చుకున్నాను" అని ఆమె తన నోట్‌లో రాశారు. ఈ ప్రయాణం తన జీవితంలో మర్చిపోలేనిదని, 'జియా'గా మారడంలో ఆయన ప్రోత్సాహం మరువలేనిదని ఆమె ఎమోషనల్ అయ్యారు. దర్శకుడు ఇంతియాజ్ అలీ ఈ సినిమా నేపథ్యం గురించి మాట్లాడుతూ.. ఇది కేవలం ఊహాజనిత కథ కాదని, దేశ విభజన సమయంలో జరిగిన యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందించినట్లు తెలిపారు. ఆ భయంకరమైన రోజుల్లో కూడా ప్రజల మధ్య ఉన్న స్వచ్ఛమైన ప్రేమ, పర్సనల్ బాండింగ్స్ చుట్టూ ఈ కథ తిరుగుతుదని అన్నారు. శార్వరి షేర్ చేసిన ఈ ఫోటోలు, ఆమె రాసిన ఎమోషనల్ నోట్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. జూన్ 12న విడుదల కాబోతున్న ఈ సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.